J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 21 24.10.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# సాయుధ పోరాటం సమాప్తం

- దేశంలో ముగిసిన నక్సల్స్ శకం
- త్వరలో మావోయిస్టు రహిత దేశంగా భారత్
- ఈ ఏడాది చివరికి కేంద్రం ప్రకటించే అవకాశం
- చరిత్రగా మారనున్న దశాబ్దాల పోరాటం

పీడిత వర్గాల కోసం సమరశంఖం పూరించిన రణ నినాదం మూగబోతోంది. భూస్వాములు, దోపిడీ రాజకీయ నాయకులపై అలుపెరగని పోరాటం చేసిన యోధులు అస్త్రాలు విడిచిపెట్టేస్తున్నారు. దశాబ్దాలుగా గిరిజనులు, పేదల కోసం ప్రాణాలు అర్పించిన అన్నలు అలసిపోయామంటూ ఆయుధాలను అప్పగించేస్తున్నారు. ఆర్థిక ప్రజాస్వామ్యం కోసం, సామ్యవాద సిద్ధాంతం కోసం పరితపించిన నక్సల్స్ ఇక చాలు అంటూ పోరాటాన్ని ఆపేస్తున్నారు.

గతంలోగా పరిస్థితులు లేవని, సమాజం ఎంతో మారిందని, చెట్లు పుట్టల మధ్య ఉండి, తుపాకీ చేతపట్టి చేసే ఉద్యమానికి కాలం చెల్లిందని గుర్తిస్తున్నారు. ఫలితంగా విప్లవమే ఊపిరిగా, సమ సమాజమే ధ్యేయంగా జీవించిన మల్లోజుల, ఆశన్న లాంటి

2లో




## లాయర్ చెప్పిందే జరిగింది!

ఏ విషయాన్ని అయినా వాస్తవ పరిస్థితుల ఆధారంగా ముందస్తుగా ఊహించడం, వాటిని పాఠకులకు విస్పష్టంగా తెలియజేయడం 'లాయర్' నైజం. దీనికి నిదర్శనంగా నక్సల్స్ ఉద్యమం అంతిమదశకు చేరుకుందని, కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' విజయవంతం కాబోతోందని ఈ ఏడాది జూన్‌లోనే తెలియజేశాం. "గెలవలేని పోరాటం కోసం.. ఎందుకీ ఆరాటం" శీర్షికతో విశ్లేషణాత్మక కథనం అందించాం..!

## కేసంటే కాటికే.. తమిళ ఖాకీల కర్కశత్వం



తమిళనాడులో పెరుగుతున్న లాకప్ మరణాలు

గత ఐదేళ్లలో 31 మంది ఖాకీల చేతిలో బలి

సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతలు... పాలనకు ఈ మూడు అంశాలు ప్రాథమిక మార్గదర్శక సూత్రాలుగా ప్రజాస్వామ్యవాదులు చెప్తుంటారు. సామాజిక న్యాయం అందించే క్రమంలో ప్రజలు, ప్రభుత్వాలు పోలీసు వ్యవస్థను ఓ రక్షణ కవచంగా భావిస్తుంటాయి. అయితే 'కంచే చేనుమేసిందన్న' సామెతగా ప్రజల ధన, మాన, ప్రాణ సంరక్షకులైన ఖాకీలే అంతులేని క్రూరత్వంతో అమాయకులపై రెచ్చిపోతున్నారు. ఒకప్పుడు సంస్కరణలకు మారుపేరైన తమిళనాడులో ప్రస్తుతం ఈ విపరీత ధోరణి అంతకంతకూ పెచ్చుమీరుతుండడం గమనార్హం.

విచారణ, దర్యాప్తు, తనిఖీలు, సోదాలు, పేరేదైనా కేసులో నిందితులు, అనుమానితులుగా ఉన్న అమాయకులు అసువులు బాయడం ఖాయం అన్నట్లుగా పరిస్థితులు నెలకొంటున్నాయి. తాజాగా శివగంగై జిల్లాలో ఓ సెక్యూరిటీ గార్డు లాకప్‌డెత్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసు విచారణ సందర్భంగా "పగ ప్రతీకారాలతో రగిలిపోతూ హత్యకు పాల్పడే ఓ హంతకుడు సైతం ఒక వ్యక్తికి ఇన్ని గాయాలు కలిగించడు" అంటూ మద్రాసు హైకోర్టు అక్కడి పోలీసుల కర్కశత్వంపై వ్యాఖ్యానించింది. మానవ హక్కుల ఉల్లంఘనను, ఖాకీల దాష్టీకాన్ని అది కళ్లకు కడుతోంది.

### కేసు ఏదైనా థర్డ్ డిగ్రీ ప్రయోగం!

ద్రవిడ సిద్ధాంతాలు, సంస్కృతులకు ఆలవాలం అయిన తమిళనాడు ఒకప్పుడు అభివృద్ధికి, ఆశావాద దృక్పథానికి పేరు గడించింది. కులతత్వం, మతతత్వం నశించాలని, నిమ్నవర్గాలు సైతం దేవాలయాల్లో అర్చకత్వానికి అర్హులే అంటూ అనేక సంస్కరణోద్య మాలు అక్కడ పురుడుపోసుకున్నాయి. అయితే ప్రస్తుతం రాజకీయ అవినీతి, మితిమీరిన అధికార గర్వం కారణంగా కక్షలు, కార్పణ్యాలు, దాడులు, హింసావాదం పెరిగిపోతోంది. ఈక్రమంలో పోలీసులు సైతం కేసుల పరిష్కారంలో ఓ వర్గానికో, ఓ నేతకో వంతపాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారు. ఫలితంగా చైన్ స్నాచింగ్ కేసో, విద్యార్థుల తగాదో కేసో, చోరీ కేసో, భారీ కుంభ కోణమో అనే తేడా లేకుండా అనుమానితులపై అత్యంత అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో డబ్బు కోసమో, ఉద్యోగోన్నతి కోసమో, ఉన్నతాధికారులు, పాలకుల ప్రాపకం కోసమో నిందితులపై నిర్ధాక్షిణ్యంగా విరుచుకు పడుతున్నారు. దర్యాప్తు పేరుతో వారిని దారుణాతి దారుణంగా హింసిస్తున్నారు. గోళ్లు పీకేయడం, మర్మాయవాలపై గాయాలు చేయడం, కళ్లలో, గాయాలపై కారం చల్లడం, బట్టలూడదీసి వేధించడం, విడతల వారీగా లాఠీలు, రాడ్లతో విచక్షణా రహితంగా దాడి చేయడం పరిపాటిగా మారింది. దీంతో రాష్ట్రంలో కస్టోడియల్ మరణాలు గణనీయంగా పెరిగిపోతున్నాయి. బాధితుల్లో ముఖ్యంగా దళితులు, పేదలు, అంగ, అర్థబలం లేని కులాలకు చెందినవారే బలవుతుండడం గమనార్హం. కొన్ని సందర్భాలలో లాకప్‌డెత్ మృతులు మైనర్లు కూడా కావడం అత్యంత విస్మయం కలిగిస్తోంది.

2లో



# సాయుధ పోరాటం సమాప్తం

(మొదటిపేజీ తరువాయి)

దిగ్గజ పోరాట వీరులు సైతం ప్రజాబాహుళ్యంలోకి వచ్చేశారు. దీంతో ఇన్నాళ్లూ మినుకుమినుకు మంటున్న మావోయిస్టు పార్టీ ఆశలు పూర్తిగా ఆవిరయ్యే పరిస్థితి నెలకొంది. సరిగ్గా ఇలాంటి పరిస్థితుల కోసమే వేచివున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోయే వారికి పునరావాసం, ఆశ్రయం కల్పిస్తామని, సంఘంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పిస్తామంటూ హామీ ఇస్తున్నాయి. ఫలితంగా వందలాది మంది నక్సల్స్ ఆయుధాలు వీడి అడవి బాటను వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు.

## దీనస్థితికి చేరిన మహోజ్వల చరిత్ర!

నాలుగున్నర దశాబ్దాల క్రితం బెంగాల్‌లో దోపిడీ వర్గం నుంచి రైతులను, గిరిజనులను కాపాడేందుకు ప్రారంభమైన ఉద్యమం క్రమంగా దేశమంతా విస్తరించింది. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వేళ్లూనుకుని ఉత్తరాన నేపాల్, తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన మహారాష్ట, దక్షిణాన దక్కన్ పీఠభూమి వరకు శాఖోపశాఖలుగా వర్ధిల్లింది. అయితే కాలక్రమేణా ఒక్కోరాష్ట్రంలో పట్టు కోల్పోతూ చివరికి ప్రస్తుతం ఛత్తీస్‌గడ్‌లోని రెండు మూడు జిల్లాలకే పరిమితమైంది. దీంతో ఇదే అదనుగా (2024లో ప్రారంభించిన) ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తీవ్రతరం చేసింది. సీఆర్‌పీఎఫ్, స్పెషల్ ఫోర్స్ విభాగం కమాండోలతో దండకారణ్యాన్ని జల్లెడ పడుతోంది. కూంబింగ్‌లో కనిపించిన వారిని కనిపించినట్లు ఎన్‌కౌంటర్ల పేరుతో మట్టుపెడుతోంది. ఒకపక్క లొంగిపోవాలని సూచిస్తూనే మరోపక్క చాపకింద నీరులా మావోయిస్టు అగ్రనేతలను అదును చూసి అంతమొందిస్తోంది. దీంతో ఒకప్పుడు 30 నుంచి 40 వరకు ఉన్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఇప్పుడు కనీసం నలుగురైదుగురు కూడా లేకుండా పోయారు. పై స్థాయిలో సరైన మార్గదర్శనం లేకపోవడంతో కిందిస్థాయిలో పూర్తిగా కొత్త రిక్రూట్ మెంట్లు ఆగిపోయాయి. ముఖ్యంగా ప్రస్తుత యువత సాయుధపోరాటం వైపు మొగ్గుచూపడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మిగిలిన ఆ కొద్దిమంది నక్సల్స్ కూడా అంతంకాక తప్పదని మల్లోజుల, ఆశన్న లాంటివారు లొంగిపోయే సమయంలో వీడియోలో తమ సహచరులకు సూచించడం నానాటికీ కుదేలౌతున్న మావోయిస్టు పార్టీ దీనస్థితిని తెలియజేస్తోంది.

## ఒక్కొక్క ఆశా సన్నగిల్లుతూ!

పాతతరం ఆయుధాలు, వయసుడిగిన నేతలు, మార్గనిర్దేశం లేని కేడర్. ఇదీ ప్రస్తుతం మావోయిస్టు పార్టీ పరిస్థితి. దీనికితోడు ఇన్నాళ్లూ కంటికి రెప్పలా కాపాడుతూ అవసరమైన ఆహారం అందజేస్తూ కీలక సమయంలో ఆశ్రయం కల్పిస్తూ తమ వెంట నడిచిన గిరిజనుల్లో కాలక్రమేణా మార్పు రావడం కూడా నక్సల్స్ ఉద్యమం అంతమవడానికి కారణంగా కనిపిస్తోంది. గతంలో తమ కోసం అన్నలు పోరాడుతున్నారంటూ వారికి అన్నివిధాలా సాయం చేసిన గిరిజనుల్లో చాలా మంది ప్రస్తుతం చదువుబాట పట్టారు. అదే క్రమంలో కొందరు పోలీసులకు ఇన్‌ఫార్మర్లుగా మారారు. అయితే అలాంటి ఇన్‌ఫార్మర్లను నక్సల్స్ నిర్ధాక్షిణ్యంగా చంపేయడంతో చాలా మంది గిరిజనులు మావోయిస్టు పార్టీకి దూరమయ్యారు. కొన్ని సందర్భాల్లో తమ గ్రామంలోకి రావద్దంటూ సంఘాలుగా ఏర్పడి మరీ అన్నలను అడ్డుకున్నారు. దీంతో నక్సల్స్ పోరాట ఆశలు క్రమంగా సన్నగిల్లాయి. ఇక అడవులు భారీగా తగ్గిపోవడం, చాలా చోట్ల రహదారులు, వంతెనలు ఏర్పాటు కావడంతో కూంబింగ్ చేపట్టే కేంద్ర బలగాలకు మరింత బలం చేకూరింది. అత్యాధునిక డ్రోన్లు, హెలికాప్టర్లు, ఆయుధాలు చేతికి రావడంతో స్పెషల్ ఫోర్స్ కమాండోలు రెట్టించిన ఉత్సాహంతో నక్సల్స్‌ను తుదముట్టించే పనిని తీవ్రతరం చేశారు. దీంతో నక్సల్స్ నిర్మూలన కోసం కేంద్రం చేపట్టిన ఆపరేషన్ కగార్ చూస్తుండగానే అత్యంత విజయవంతమైంది.

## అడవిలో పోరాటం అడవికాచిన వెన్నెలేనా?

దేశవ్యాప్తంగా ఒకప్పుడు 16 రాష్టాలకు పైగా నక్సల్స్ ఉద్యమం సాగింది. వీరికి సమాజంలోని మేధావులు, యూనివర్సిటీల్లోని విద్యార్థి సంఘ నాయకులు, యువత, విప్లవ రచయితల సంఘం(విరసం) సభ్యులు, సైద్ధాంతిక భావజాలం ఉండే ప్రొఫెసర్లు వెన్నుదన్నుగా ఉండేవారు. నక్సల్స్‌లతో చర్చలు జరిపి, వారి డిమాండ్లను తెలుసుకోవాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చేవారు. తద్వారా ఎప్పటికప్పుడు యువ నాయకత్వం మావోయిస్టు పార్టీకి అందేది. అయితే కాలక్రమంలో ఇవన్నీ తగ్గుముఖం పట్టడంతో కేంద్ర ప్రభుత్వం జనంలోకి వస్తారా..? అడవుల్లో చస్తారా..? అంటూ తీవ్ర హెచ్చరికలు చేస్తూ ఏమాత్రం కనికరం లేకుండా తుదముట్టించేందుకే నిర్ణయించింది. ఫలితంగా ప్రాణభయంతో కొందరు, ముందు జాగ్రత్తలతో మరికొందరు, వాస్తవ పరిస్థితులను గుర్తెరిగి ఇంకొందరు అడవులు వదిలి జనంలోకి వచ్చేస్తున్నారు. ఇలాంటి వారిలో ఉద్యమంలో కాకలుతీరిన, పార్టీలో పొలిట్‌బ్యూర్ సభ్యులైన మల్లోజుల, ఆశన్న లాంటి అగ్రస్థాయి నేతలుండడం విశేషం. ఎందుకంటే మల్లోజుల గత 45 ఏళ్లుగా ఉద్యమం కోసమే బతికారంటే ఆశ్చర్యం కలిగించక మానదు. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల రూపకల్పన కాలం నుంచే ఆయన కీలకంగా పనిచేశారు. ముఖ్యంగా నక్సల్స్ నుంచి విడుదలయ్యే ప్రతికాప్రకటనలు, సాహిత్య అంశాల రూపకల్పన వెనుక మల్లోజులే ఉండేవారు. ఇక సుక్మాజిల్లాలో 75 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను అంతమొందించడంతో పాటూ సీనియర్ ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర, హోంమంత్రి మాధవరెడ్డి హత్య కేసులో ఆశన్న ముఖ్యపాత్ర పోషించారు. అతిముఖ్యంగా 2003లో నాటి సీఎం చంద్రబాబునాయుడిపై అలిపిరి క్లైమోర్‌మైన్ దాడికి స్కెచ్ వేసింది అశన్నే. ఇంతటి చరిత్ర ఉన్న అగ్రనేతలు మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రుల ముందు తమ అనుచరులతో వందలాదిగా లొంగిపోవడం మావోయిస్టు పార్టీ అంతానికి సూచికగా విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా లొంగిపోయే సమయంలో ప్రజలతో సంబంధంలేని అడవిలో పోరాటం అడవి కాచిన వెన్నెల వంటిదే అని వారు పేర్కొనడం గమనార్హం.

## మరో నెలన్నర లోపే ముగింపు ప్రకటన..?

ఇక ప్రస్తుతం దేశంలో 2వేల మంది వరకు మావోయిస్టులు మిగిలారని వారిలో 500 మంది వరకు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తాజాగా ప్రకటించారు. 'ఆపరేషన్ కగార్' లక్ష్యమైన 2026 మార్చి నాటికంటే ముందుగానే నక్సల్స్ రహిత భారత్‌ను చూడబోతున్నామని ప్రకటించారు. అన్నీ కుదిరితే ఈ ఏడాది చివరి నాటికే మావోయిస్టు ముగింపు ప్రకటన రావొచ్చని విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని బీజ్‌పూర్, సుక్మా, నారాయణ్‌పూర్ జిల్లాల్లో మాత్రమే నక్సల్ కార్యకలాపాలు ఉన్నాయని హోంమంత్రి అమిత్‌షా తెలిపారు. పరిస్థితులు వేగంగా మారిపోతున్న నేపథ్యంలో ఉన్న కొద్దిపాటి నక్సల్స్ కూడా లొంగిపోయేందుకు అధికారులను సంప్రదించే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం కేంద్రం తొందరలోనే 'ఆపరేషన్ కగార్'ను ఆపేసి మావోస్టులందరికీ లొంగిపోయే అవకాశం ఇవ్వనుందని, ఇంద్రావతి నది వద్ద లొంగిపోయే మావోయిస్టుల కోసం ప్రత్యేకంగా బోట్లను కూడా ఏర్పాటు చేయనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే నిజమైతే మావోయిస్టు ఉద్యమం చరిత్రగా మిగిలిపోయే అవకాశం ఉంది. ఇక తాజా లొంగుబాట్లపై మావోయిస్టు పార్టీ మాత్రం తీవ్రస్వరంతోనే ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రాణభయంతో పిరికిపందలు తీసుకున్న నిర్ణయం అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. వెనక్కితగ్గే ప్రసక్తే లేదంటూ ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం ఉనికి చాటుకునే ప్రకటనే అని, వాస్తవ పరిస్థితిని గమనిస్తే మాత్రం నక్సల్స్ ఉద్యమం అంతమయ్యేందుకు ఇక ఎక్కువ కాలం పట్టకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా నాలుగున్నర దశాబ్దాల ఉద్యమం త్వరలోనే ముగుస్తుందనే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయన్నది అందరూ అంగీకరిస్తున్న వాస్తవం.

---

# జిల్లాలో భారీ వానలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలతో గత నాలుగైదురోజులుగా జిల్లా అతలాకుతలమైపోతోంది. వాగులు వంకలు, చెరువులు దొరువులన్నీ పొంగిపొర్లుతున్నాయి. జలాశయాలు నిండిపోయాయి. జనజీవనం స్తంభించిపోయింది. అనేకచోట్ల రోడ్లు దెబ్బతిని వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈదురుగాలుల ధాటికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కుండపోత వానలతో అనేకచోట్ల పొలాలు నీట మునగడంతో అన్నదాతలు గోడుగోడుమంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో బడులకు సెలవులిచ్చేశారు.

# ఆక్రమణలు తొలగించారు

నెల్లూరు హరనాథపురంలోని కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారంటూ, ఆ నిర్మాణాన్ని ఈనెల 22న టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. భక్తవత్సలనగర్ కాలువలను ఆక్రమిస్తూ కట్టిన ఆ కట్టడాలను కూల్చేశారు. ఏసీపీలు వేణు, మురళి, సిబ్బంది ఆధ్వర్యంలో ఈ తొలగింపు జరిగింది.

# తమిళ ఖాకీల కర్కశత్వం

(మొదటిపేజీ తరువాయి)

## కేసుల నమోదు తప్ప శిక్షలేవీ?

లాకప్ మరణాలపై మానవ హక్కుల సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, కోర్టుల చొరవతో కేసులు నమోదవుతున్నా, దోషులైన అధికారులకు శిక్షలు మాత్రం పడడం లేదు. గత కొన్నేళ్లుగా తమిళనాడులో చోటు చేసుకున్న కేసులు, వాటి దర్యాప్తును పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతోంది. దక్షిణభారత దేశంలో అత్యధిక లాకప్‌డెత్ కేసులు నమోదవుతున్న రాష్ట్రం తమిళనాడు అని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీ ఆర్‌బీ) నివేదిక స్పష్టం చేస్తోంది. జాతీయ స్థాయిలో గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో లాకప్‌డెత్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ఇక తమిళనాడులో గత ఐదేళ్ల కాలంలో 31 కస్టోడియల్ మృతి కేసులు నమోదవగా వాటిలో కొన్ని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

- 2020 జూన్‌లో తూత్తుకుడి జిల్లా సాతంకుళం పట్టణంలో కరోనా కర్ఫ్యూ సమయంలో మొబైల్ దుకాణం తెరిచారనే కారణంతో పి.జయరాజ్, జె.బెన్నిక్స్ అనే తండ్రి కొడుకులను పోలీసులు అత్యంత దారుణంగా హింసించారు. దీంతో వారు లాకప్‌లోనే విగతజీవులయ్యారు. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్నా ఐదేళ్లుగా విచారణకే పరిమితమైంది. ఈ కేసులో సీఐ సహా ఆరుగురు పోలీసులు నిందితులుగా ఉన్నారు.
- 2022లో చెన్నైలో దళిత యువకుడు విఘ్నేష్ పోలీసు కస్టడీలో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. తల, కనుబొమ్మలు, అంతర్గత అవయవాలు తీవ్రంగా దెబ్బతిని మరణించాడు. ఈకేసు మూడేళ్లుగా సీబీ సీఐడీ విచారణ చేస్తోంది.
- తిరువణ్ణామలై జిల్లాలో తంగమణి అనే వ్యక్తి సారా విక్రయిస్తున్నాడనే కారణంతో పోలీసులు అదుపులోకి తీసుకుని తీవ్రంగా కొట్టడంతో రక్త గాయాలతో మరణించాడు.
- 2023లో 17ఏళ్ల బాలుడు దొంగతనం కేసులో అబ్జర్‌వేషన్ హోంలో ఉండగా, పోలీస్ టార్చర్‌తో మృతి చెందాడు. బాలుడి మృతదేహంలో 96 తీవ్రమైన గాయాలు ఉండడం అప్పట్లో పెను సంచలనం కలిగించింది. దేశవ్యాప్తంగా విమర్శలు రావడంతో అక్కడి ప్రభుత్వం 2024లో జువైనల్ జస్టిస్ కింద పనిచేస్తున్న హోంలలోని సిబ్బంది పనితీరుపై రిటైర్డ్ జస్టిస్ చంద్రు నేతృత్వంలో ఓ కమిటీని కూడా నియమించింది.
- 2025 జూన్ 28న శివగంగై జిల్లా తిరుప్పావనంలో సెక్యూరిటీ గార్డుగా ఉన్న అజిత్‌కుమార్ పోలీసు కస్టడీలో 44 తీవ్ర గాయాలతో, మెదడులో రక్తం గడ్డకట్టిన స్థితిలో మరణించాడు. ఈ కేసులో ఆలయానికి వచ్చిన ఓ మహిళ సెక్యురిటీ గార్డుగా ఉన్న అజిత్‌కుమార్‌కు కారు పార్క్ చేయాలని కీ ఇచ్చిందని, తర్వాత ఆమె తన బంగారు నగలు కనిపించలేదంటూ ఫిర్యాదు ఇవ్వడంతో కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకుండా స్పెషల్ పార్టీ పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించి హింసించి చంపడంపై విపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు దుమ్మెత్తిపోశాయి. దీంతో సీఎం స్టాలిన్ ఈ కేసును సీబీఐకి అప్పగించడంతో పాటు మృతుడి తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం, తల్లికి 3సెంట్ల స్థలం, రూ.5లక్షల పరిహారం ప్రకటించారు.

## మార్పు రావాలంటే..

నిందితులను, అనుమానితులను విచారించేటప్పుడు పోలీసులు విచక్షణతో వ్యవహరించాలన్నా, తప్పుడు కేసులతో ప్రజలను వేధించే చర్యలకు అడ్డుకట్ట వేయాలన్నా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.

- ముఖ్యంగా లాకప్ డెత్ కేసుల్లో కింది స్థాయి సిబ్బందిని కాకుండా ఉన్నతాధికారులనే ఏ-1, ఏ-2గా నమోదు చేసేలా చట్టంలో మార్పులు తీసుకు రావాలి. ఎందుకంటే 2023లో తిరునల్వేలి జిల్లాలోని అంబసముద్రంలో ఓ కేసు విషయంగా కొందరు అనుమానితులను విచారించే క్రమంలో 10 మందికి ఐపీఎస్ అధికారైన బల్వీందర్ సింగ్ పళ్ళు పీకేసి వేధించడం కలకలం రేపింది. ఈ కేసులో కిందిస్థాయి సిబ్బంది కొందరిపై వేటు వేసి ఉన్నతాధికారికి మాత్రం కొన్ని నెలల తర్వాత యథాతథంగా పోస్టింగ్ ఇవ్వడం విమర్శలపాలైంది.
- పోలీసులపై నమోదయ్యే కేసుల్లో దర్యాప్తు బాధ్యతను స్వతంత్ర సంస్థలకు ఇవ్వడమే కాకుండా ఎప్పటికప్పుడు కేసు పురోగతిని బహిరంగ పరచాల్సి ఉంది. అలాగే వారిని శాశ్వతంగా డ్యూటీల నుంచి తప్పించి క్రిమినల్ కేసుల్లో ముద్దాయిగా ప్రకటించాలి. అప్పుడే ఉద్యోగ భద్రత కోసమైనా సిబ్బంది అడ్డదారులు తొక్కకుండా నీతి నిజాయితీతో వ్యవహరించే అవకాశం ఉంటుంది.
- అలాగే రాష్ట్రంలోని ప్రతి లాకప్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి చేసేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.
- లాకప్‌డెత్ బాధితులకు పరిహారంతో పాటు వారి కుటుంబసభ్యులకు ఉద్యోగం కల్పించాలి.
- దేశద్రోహం, ఉగ్రవాదం వంటి కేసుల్లో తప్ప పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయాన్ని వెంటనే సదరు వ్యక్తి కుటుంబ సభ్యులకు లిఖిత పూర్వకంగా తెలియజేసేలా ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం కూడా చాలా ఉంది.


2021నుండి 2025 సెప్టెంబర్ వరకు తమిళనాడులో జరిగిన లాకప్‌డెత్ కేసుల వివరాలని గమనిస్తే క్రింద విధంగా వున్నాయి.

2021లో 4, 2022లో 11, 2023లో 2, 2024లో 10, 2025 అంటే ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 8 కేసులు నమోదయ్యాయి.

---

# పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు

నెల్లూరు సమీపంలోని కల్లూరుపల్లి శ్రీలంక కాలనీ వార్డు సచివాలయం పరిధిలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు సచివాలయం శానిటేషన్ కార్యదర్శి బ్రహ్మానాయుడు ఈనెల 22న రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శి మునికిరణ్, విఆర్‌ఓ జనార్ధన్, వెల్ఫేర్ కార్యదర్శి చెంచులక్ష్మి, ప్లానింగ్ కార్యదర్శి హసన్ పాల్గొన్నారు.



# అయ్యప్ప సన్నిధిలో మన రాష్ట్రపతి

భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదిముర్ము అక్టోబర్ 22వతేదీ బుధవారం నాడు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలైని సందర్శించారు. రాజధాని ఢిల్లీ నుండి తిరువనంత పురం చేరుకున్న ఆమె, బుధవారం ఉదయం ప్రత్యేక ఆర్మీ హెలికాప్టర్లో బయలుదేరి 7 గంటలకి ప్రమదం పట్టణంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంకి చేరుకున్నారు. అక్కడి నుండి తన భద్రతా సిబ్బందితో కలసి పంబ చేరుకున్నారు. పంబలో పాద ప్రక్షాళనం చేసుకుని, సమీపంలోని ఆలయాలను సందర్శించారు. అక్కడే వున్న కేట్టునీర మండపం వద్ద ఆమె ఇరుముడి ధరించారు. అనంతరం ప్రత్యేక ఫోర్‌వీల్ డ్రైవ్ వాహనంలో శబరిగిరికి చేరుకున్నారు. అయ్యప్ప సన్నిధానానికి చేరుకున్న అనంతరం తన వ్యక్తిగత సిబ్బంది సహకారంతో అతి పవిత్రమైన 18మెట్ల ద్వారా ఆమె ఆలయ ప్రధాన మండపానికి చేరుకున్నారు. కార్యక్రమం ఆద్యంతం ఆమె అయ్యప్ప నామస్మరణ చేయడం గమనార్హం. అయ్యప్ప ఆలయంలో ఇరుముడిని సమర్పించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయ్యప్పస్వామిని దర్శించిన తొలి మహిళా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కాగా, శబరిమలైని సందర్శించిన రెండవ భారత రాష్ట్రపతి శ్రీమతి ముర్ము కావడం విశేషం! గతంలో 1970 దశకంలో ఆనాటి రాష్ట్రపతి వీవీ గిరి శబరిమల సందర్శించారు. శబరిగిరిని సందర్శించిన తొలి రాష్ట్రపతి ఆయనే. అనంతరం మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత ద్రౌపది ముర్ము రాష్ట్రపతి హోదాలో అయ్యప్ప దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమం కోసం ఆమె సంప్రదాయబద్దంగా నలుపు చీరని ధరించి రావడం అందరినీ ఆకట్టుకుంది.



## ప్రమదంలో తప్పిన ప్రమాదం!

తిరువనంతపురం నుండి ప్రత్యేక సైనిక హెలికాప్టర్‌లో కేరళలోని ప్రమదం పట్టణానికి చేరుకున్న రాష్ట్రపతికి తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఆమె ప్రయాణించిన హెలికాప్టర్ ఆమె కోసంగా ప్రత్యేకంగా నిర్మించిన హెలిప్యాడ్‌లో దిగిన అనంతరం హెలికాప్టర్ టైర్లు రెండూ కాంక్రీట్‌లో కూరుకుపోయి, హెలికాప్టర్ ఓ పక్కకి ఒరిగిపోయింది. అక్కడే వున్న భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు అప్రమత్తమై రాష్ట్రపతిని సురక్షితంగా కిందకి దించి.. అనంతరం హెలికాప్టర్‌ని పక్కకి నెట్టారు. రాష్ట్రపతికి పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఇది కేరళ ప్రభుత్వ భద్రతా వైఫల్యంగా బీజేపీ సహా విపక్షాలన్నీ మండిపడుతున్నాయి. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

## కోవూరు ముంపు బాధితులకు..
# 'విపిఆర్ ఫౌండేషన్' చేయూత



జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కోవూరులోని ముంపు ప్రాంత ప్రజలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదుకుంటున్నారు. కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం లోతట్టు ప్రాంతంలోని గిరిజనుల నివాసాలు ముంపుకు గురికావడంతో, స్థానిక నాయకుల సహకారంతో గిరిజనులకు ప్రభుత్వ పాఠశాలలో ఆమె షెల్టర్ ఏర్పాటు చేయించారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముంపు బాధితులకు మంచినీటి వసతి, భోజన వసతి కల్పించి ఆదుకుంటున్నారు.

# ప్రసన్నకి బెయిల్



కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి ఓ కేసులో ముందస్తు బెయిల్ లభించింది. టీడీపీ నాయకుడు కె.మల్లికార్జునపై దాడి, హత్యాయత్నానికి సంబంధించిన కేసులో ప్రసన్నతో పాటు, మరో 13 మందికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ, నెల్లూరు 3వ అదనపు జిల్లా జడ్జి ఎల్. తేజోవతి బుధవారం ఉత్తర్వులిచ్చారు. కొడవలూరు పోలీసులు నమోదు చేసిన ఈ కేసులో డీసీఎంఎస్ మాజీ ఛైర్మెన్ వీరి చలపతితో పాటు, బి.దాసు, ఏ.ఉదయ్ భాస్కర్, వీరి సురేష్, పానేటి శ్రీకాంత్‌లు ఇప్పటికే జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. వారికి కూడా బెయిల్ మంజూరుచేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

# హాస్టళ్ల పరిశీలన

ప్రభుత్వ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని బీసీ విద్యార్థి యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఉల్లిపాయల మురళీకృష్ణయాదవ్ కోరారు. బుధవారం ఆయన నెల్లూరు నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ వద్దనున్న హాస్టళ్లను పరిశీలించారు. విద్యార్థులంతా బాగా చదువుకోవాలని, వారికి విద్యావసతులు బాగుండాలని సిబ్బందికి చెప్పారు.

# 3న..సమ్మె చేస్తాం

తమ సమస్యల సాధన కోసం కావలిలో మునిసిపల్ కార్మికులు నవంబరు 3వ తేదీ సమ్మె చేయాలని తలపెట్టారు. ఈనెల 22న కావలి మునిసిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో కార్మిక నాయకులు మాట్లాడుతూ, మునిసిపాలిటీలోని పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, రవాణా తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉంటోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సమ్మె చేయాలని నిర్ణయించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ ధర్నాలో మునిసిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.ఆదినారాయణ టి. వెంకటేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లె అంకయ్య, సీపీఐ నాయకులు దర్గాబాబు, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు నుంచి..
# 'అరుణాచలం'కి ప్రత్యేక బస్సు

పవిత్ర పుణ్యక్షేత్రమైన అరుణాచలంని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ వారు ఆత్మకూరు నుంచి ప్రత్యేక బస్సు నడపనున్నారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఆత్మకూరు నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి. ఆ బస్సులో భక్తులు మార్గ మధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డన్ టెంపుల్, అరుణాచలంతో పాటు కంచి, తిరుత్తణి, కాళహస్తి క్షేత్రాలను కూడా దర్శించవచ్చని, ప్రత్యేకించి అరుణాచలంలో గిరిప్రదక్షిణ, దైవదర్శనం చేసుకున్నాకనే బస్సు తిరిగి ఆత్మకూరుకు బయలుదేరి వస్తుందని పేర్కొన్నారు.

# ఆకాశదీపానికి మంత్రి పూజలు



కార్తీకమాసం సందర్భంగా నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరాలయానికి ఈనెల 22న మంత్రి నారాయణ కుటుంబ సమేతంగా వచ్చి తన కుమార్తె షరణితో కలసి ఆకాశదీపాన్ని ప్రారంభించి పూజలు చేశారు. ప్రముఖ దాత ఆల్తూరి గిరీష్ కుమార్‌రెడ్డి, ఇఓ శ్రీనివాసులురెడ్డి, మాజీ మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపానికి పూజలు చేసి, స్వామివారి వనంలో అఖండ దీపం వెలిగించి, కార్తీకమాసానికి వారు స్వాగతం పలికారు.

# స్మార్ట్ స్ట్రీట్ పరిశీలన



రాష్ట్రంలోని మొట్టమొదటిసారిగా నెల్లూరు మైపాడు గేట్ సెంటర్లో తన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ని ఈనెల 22న మంత్రి నారాయణ, తన కుమార్తె షరణితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా వ్యాపారులతో వారు ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అంటూ ఆరా తీశారు. అనంతరం, ఓ షాపులో షరణి ఓ చీరను కొనుగోలు చేశారు. తమ షాపుల వద్దకు వచ్చిన మంత్రికి, ఆయన కుమార్తెకు వ్యాపారస్తులు సాదరస్వాగతం పలికారు.

# వక్ఫ్ ఆస్తులన్నీ..ఆ భగవంతునివే!

**- రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్**



వక్ఫ్ ఆస్తులన్నీ ఆ దేవుడివేనని, అవేమీ ముత్తవల్లీల ఆస్తులు కాదని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. ఈనెల 22న ఆయన నెల్లూరు నుంచి రాష్ట్రంలోని ముత్తవల్లీ వక్ష్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ముత్తవల్లీలు కేవలం మేనేజర్లు మాత్రమేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆక్రమణల్లో ఉన్న సుమారు 7వందల ఎకరాల ఆస్తులని ఇటీవలనే స్వాధీనం చేసుకున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. వక్ఫ్ ఆస్తులు కాపాడడంలో ప్రభుత్వ అధికారి విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. ముత్తవల్లీలు వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలన్నారు. వక్ఫ్‌బోర్డు ఆదాయం పెంచి, దానిని పేద ముస్లిమ్‌ల సంక్షేమానికి వినియోగిస్తామన్నారు. విద్యలో రాణిస్తున్న 500మందికి వచ్చే ఏడాది విద్యాసంవత్సరంలో ఉచితంగా ఇంటర్ చదివించేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు సభ్యుడు జాకీర్ అహ్మద్, సీఇఓ జాకీర్ అహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

# కార్తీకమాసంపై ఆర్డీఓ సమావేశం



నెల్లూరు మూలాపేటలోని శివాలయంలో కార్తీక మాసోత్సవం నిర్వహణపై ఆర్డీఓ అనూష గురువారం నాడు అధికారులతో సమీక్షించారు. కార్తీక మాసోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈనెల 22 నుంచి నవంబరు నెల 20వ తేదీ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలన్నారు. కార్తీక సోమవారాలు, కార్తీక పున్నమి రోజుల్లో భక్తుల కోసం మరింత పటిష్టవంతంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. శివాలయం వెనుకవైపున పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకులు వందవాశి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాయర్
అక్టోబర్ 24, 2025

# 'పొదుపు'.. జీవితాలకో మలుపు!

'ఆయనకేం..జల్సా పురుషుడు..డబ్బుంటే లెక్కే ఉండదు. నీళ్లలాగా ఖర్చుపెట్టేస్తాడు'.. వంటి మాటలను మనం అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం. అయితే, అందరికీ అది వర్తించదు. డబ్బును అలా ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టేస్తే.. ఆ తర్వాత జీవితాలు ఏమైపోతాయో తెలుసుకునేసరికి, చాలా కుటుంబాల కథలు విషాదాంతంగానే ముగుస్తుంటాయి. కోట్లకి పడగలెత్తిన వారి సంగతి వదిలేస్తే, దేశంలో అత్యధిక సంఖ్యాకులైన పేద, సామాన్య, మధ్య తరగతి జనానికి..వారి జీవనానికి అనునిత్యం కావాల్సింది డబ్బే. ఇంధనం లేకపోతే బండెలా నడవదో.. ధనం లేకపోతే జీవితపు బండి కూడా నడవదన్నది అందరికీ తెలిసిందే. అట్లని, కూర్చుని తింటే కొండలైనా తరిగిపోతాయంటారు పెద్దలు. నిజమే!..లేనిపోని జల్సాలకు పోయి ఉన్న డబ్బంతా ఊడగొట్టుకుంటే ఆ తర్వాత చేయగలిగిందేమీ లేదు. 'అప్పుల బాధలతో కుటుంబం ఆత్మహత్య' వంటి వార్తలు అనేకం చదువుతూనే ఉంటాం. ఒక వ్యక్తి చేసే అప్పుల తప్పులకి ఆ కుటుంబమంతా మూల్యం చెల్లించాల్సిన దుస్థితికి ఇలాంటివి పెద్ద ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. అందులోనూ ఈ అధునాతన కాలంలో పాశ్చాత్త్య నాగరికత పెరిగిపోయింది. విలాసంగా బతకడమే ఫ్యాషనైపోయింది. దీంతో, 'ఈజీ మనీ' కోసం కొందరు యువత ప్రాణాలకి సైతం తెగబడి దొంగతనాలు కూడా చేసేసి నేరస్తులయిపోతున్నారు. డబ్బు కోసం నేరాలు, ఘోరాలు, చివరికి హత్యలు, ఆత్మహత్యలు భారీస్థాయిలో పెరిగిపోతున్న నేటికాలంలో జనం చాలా జాగ్రత్తగా జీవితాన్ని-జీవన వ్యయాన్ని సరిచూసుకోవాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, దాన్ని జాగ్రత్తగా పొదుపు చేసుకోవడం కూడా అంతే ముఖ్యమని అంటున్నారు. బిడ్డల చదువులకి, ఇంటి అద్దె, విద్యుత్‌ఛార్జీలు వంటి అత్యవసరాలకి డబ్బు ఖర్చు చేయడం తప్పనిసరి. కనుక, ఎవరైనా సరే..తమకు వచ్చే జీతం లేదా ఆదాయానికి తగ్గట్టు ప్రణాళికాబద్ధంగా జీవనం సాగించకపోతే నేటి కాలంలో కష్టాలు తప్పవంటున్నారు. వీటిన్నిటికీ ప్రాణప్రదమైన అంశం పొదుపే. ఒక్కసారి పొదుపు చేసుకునే అలవాటు చేసుకుంటే ఒక్క డబ్బులోనే కాదు, నీరు-ఆహారం-విద్యుత్ వంటి కీలకమైన రంగాల్లో కూడా పొదుపు అలవడుతుంది.

ఉద్యోగాలు చేస్తున్నవారు తమకు వచ్చే జీతంలో తప్పనిసరిగా కనీసం పది శాతమైనా పొదుపు చేసుకుంటే, ఆ తర్వాత అది భావి జీవితానికి ఎంతగానో ఉపకరిస్తుంది. హాయిగా, గౌరవప్రదంగా జీవించడానికి ఎంత కావాలో, ఆ డబ్బును ధర్మబద్ధంగా ఎలా సమకూర్చుకోవాలో, దానికోసం ఎంత కష్టపడాలో కుటుంబసభ్యులకి అవగాహన ముఖ్యం. ముందు జాగ్రత్తగా తమకున్నదాంట్లో ఎంతో కొంత పొదుపు చేసుకుని జీవితాలు సాగించాలి. డబ్బు పొదుపు చేసుకోవాలి కనుక పీనాసితనంతో ఉండకూడదు. ఖర్చు చేయాల్సిన చోట వెనుకంజ వేయకూడదు. డబ్బును ఇతరత్రా పొదుపు పథకాల్లో మదుపు చేసుకోవడం కూడా ప్రయోజనకరమే. ఏది ఎంతవరకు ఖర్చుచేయాలో అంతే చేయాలనే విచక్షణ కూడా ఉండాలి. చేతిలో డబ్బుంది కదా అని విచ్చలవిడిగా ఖర్చుచేస్తే, కష్టం వచ్చినప్పుడు రూపాయిచ్చేవారుండరు. ఆర్థిక శాంతి లేకుంటే జీవితమంతా అశాంతి అని గుర్తించిన వారికి, పొదుపు విలువ ఇంకా బాగా తెలుస్తుంది. ఏదేమైనా, మనకున్న డబ్బును గానీ, ఇతరత్రా వనరులను కానీ సక్రమంగా, పొదుపుగా వాడుకోవడం ఎంత ముఖ్యమో మన నుంచి మన పిల్లలు గ్రహిస్తారు. ఆ పొదుపును వారు కూడా అనుసరిస్తారు. మనం పొదుపు చేయకుండా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే, ఆ తర్వాత మన పిల్లలు కూడా అదే దారిలో వెళ్తారు. ఇక వాళ్లను అదుపు చేసేవారు కూడా ఉండరు. అందుకే, ఏ వ్యక్తి అయినా సరే, డబ్బు సంపాదనతో పాటు పొదుపుగా వినియోగించుకోవడాన్ని కూడా అలవాటు చేసుకోవాలి. అలా ఒక్కరు చేసే పొదుపు ఆ కుటుంబానికి, కుటుంబాలు చేసే పొదుపు సమాజానికి, సమాజంలో ఉన్న పొదుపు చివరికి దేశానికి కూడా మేలే చేకూరుస్తుంది. పొదుపు జీవితాలకో మలుపు అనేది అందుకే!.. మారుతున్న కాలాన్ని, అవసరాలని గుర్తుంచుకుని పొదుపు చేయకుంటే, జీవితంలో కష్టాలేనన్నది సారాంశం. అందుకే, అంతర్జాతీయ స్థాయిలో 'పొదుపు' విలువను గుర్తుచేస్తూ ప్రతిఏటా అక్టోబరు 30న ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. పొదుపంటే కేవలం డబ్బు దాచుకోవడానికే కాదు, దేశ ఆర్థికశక్తిని కూడా బలోపేతం చేసేందుకు పొదుపు ఎంతో ఉపయోగపడుతుంది. కాబట్టి, అందరం పొదుపును అలవాటు చేసుకుందాం..భావితరాలకీ అలవాటు చేద్దాం!...

## శివయ్య భక్తులను నిరాశపరచిన ప్రధాని!

'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కర్నూలులో ఏర్పాటు చేసిన 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' బహిరంగ సభ కోసం ఇటీవల మన భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేకంగా విచ్చేశారు, బాగానే ఉంది. ఎలాగూ కర్నూలు దాకా వస్తున్నారు కాబట్టి పనిలో పనిగా ఆయన ప్రఖ్యాత పుణ్యక్షేత్రం, జ్యోతిర్లింగాలలో రెండవదైన శ్రీశైలాన్ని కూడా సందర్శించారు, ఇదీ బాగానే ఉంది. అయితే, ఇక్కడ ఒక్క విషయం మాత్రం తెలుగు వారిని నిరాశ పరచిందన్నది నా అభిప్రాయం. దేశంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రధానమంత్రి పర్యటనలో శ్రీశైలం ఆలయానికి వరాలు ప్రకటించి ఆలయ అభివృద్ధికి ఆయన రాచబాటలు వేస్తారని అందరూ భావించారు. కానీ, ఆయన కేవలం దర్శనం, ధ్యానంలతో సరిపెట్టుకుని వెళ్ళిపోయారు. రాష్ట్రంలోని కూటమి పెద్దలైనా శ్రీశైలం అభివృద్ధికి కొన్ని ప్రణాళికలు రూపొందించి ప్రధాని దృష్టికి తెచ్చుంటే బాగుండేదేమో అన్నది నా బాధ. ఇది నా ఒక్కడి ఆలోచన కాదు.. హిందుత్వాన్ని ఆరాధించే ప్రతీ తెలుగువాడి ఆవేదన!

– లక్ష్మీ భరద్వాజ్, హైదరాబాదు.

## ఆత్మకూరు ఆసుపత్రిలో చీకటి కష్టాలు!

నెల్లూరుజిల్లా ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. కరెంట్ పోతే ఆసుపత్రిలో చీకటి మయమైపోతోంది. అవసరానికి తగ్గట్లుగా ఆదుకోవడానికి ఇక్కడ ఇన్వర్టర్లు లేవు. ఉన్న ఒక్కగానొక్క జనరేటర్ సమయానికి పని చేయదు. వెలగని లైట్లతో, తిరగని ఫ్యాన్లతో ఈ ఆసుపత్రిలో రోగులు నానా అగచాట్లు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని తిట్టుకుంటూ తమ సెల్‌ఫోన్ల లైట్లతోనే సర్దుకుపోతున్నారు. విచిత్రంగా అక్కడ పనిచేసే నర్సులు, ఇతర సిబ్బంది కూడా తమ సెల్‌ఫోన్ లైట్ల ద్వారానే రోగులకు సేవలందిస్తున్నారు తప్ప, సమస్య తీవ్రతని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడంలేదు. ఈ కరెంటు కష్టాలతో పసిబిడ్డలు, గర్భిణీ స్త్రీలు, పండువృద్ధులు విలవిలలాడిపోతున్నారు. ఈ పరిస్థితికి తగ్గట్లుగా వేల సంఖ్యలో దోమలు ఆసుపత్రిపై దండయాత్ర చేసి దొరికిన వారిని దొరికినట్లుగా కుట్టి రక్తం పీల్చుకుంటున్నాయి. మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి గారు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గారు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులూ ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిపై దయచూపి తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా మనవి!

– జి.నరేంద్రనాయుడు, ఆత్మకూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## నగరంలో పెరిగిపోతున్న ఆటోవాలాల ఆగడాలు!

నెల్లూరు నగరంలో ఆటోవాలాల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ల వంటి ప్రధాన ప్రదేశాలలో వాళ్ళు చెప్పిందే వేదం అన్నట్లుగా చార్జీలు డిమాండ్ చేస్తున్నారు. ప్యాసెంజర్లు రాపిడ్ బుక్ చేసుకుంటే రాపిడ్ వాళ్ళు తక్కువ రేట్లకే వస్తున్నారు. కానీ, అక్కడి ఆటోవాళ్ళు అటు రాపిడ్ డ్రైవర్లతోనూ ఇటు బుక్ చేసుకున్న ప్యాసింజర్లతోనూ తగువుకి వస్తున్నారు. వారిపై దౌర్జన్యానికి తెగబడుతున్నారు. ఇక నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఆటోవాలాలు నడిరోడ్లలో ఆటో అడ్డంగా ఆపేసి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై తిరగబడుతున్నారు. నగరంలో తిరిగే సగానికిపైగా ఆటోలకి పోలీసుశాఖకు సంబంధిన వారే యజమానులు కావడంతో, ఆటోడ్రైవర్ల అరాచకాలని ప్రశ్నించేవారు కరువైపోయారు. ఈ విషయంలో జిల్లా ఎస్పీ గారు దృష్టి సారించాలని కోరుతున్నాను!

కే.సుబ్బారెడ్డి, ఫత్తేఖాన్‌పేట.




## 'నెరవేరని కల'గా మిగిలిపోయిన పేదరిక నిర్మూలన!

దేశంలో రానురాను పేదరికం పెను జాడ్యంలా తయారవుతోంది. పాలకుల దృష్టి ప్రజాకర్షక పథకాలపైనే ఉంటోంది తప్ప, పేదల అభ్యున్నతి వైపు చూడడం లేదు. దేశాన్ని అనాదిగా పట్టి పీడిస్తున్న పేదరికం నుంచి ప్రజలను విముక్తం చేయాల్సిన పార్టీలు, పాలకులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఎప్పటికప్పుడు తమ అధికారాన్ని నిలబెట్టుకుని మళ్ళీమళ్ళీ అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతే తప్ప, అట్టడుగు వర్గాల బాగోగులు పట్టించుకోవడంలేదు. దేశాన్ని అధోగతి పాలుచేస్తున్న పేదరికాన్ని గాలికొదిలేసి, ఉచిత పథకాలు, సంక్షేమ కార్యక్రమాల పేరుతో కోట్లాది రూపాయల నిధులను వృధా చేస్తున్నారు. కేవలం ఉచితాలతో, సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన అసాధ్యమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇటీవలి కాలంలో ప్రజల ఓట్లను కొల్లగొట్టేందుకు మన దేశంలోని పలు పార్టీలు అనేక ఆకర్షణీయమైన పథకాలను అమలు చేస్తున్నాయి. నాయకులు మాత్రం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చాక పేదరికాన్ని నిర్మూలిస్తాం అంటూ బీరాలు పలుకుతారు. తీరా అధికారం చేజిక్కించుకున్న తరువాత ఆ ఊసే ఉండదు. కోట్లాదిమందికి ఉద్యోగాలిచ్చేస్తాం, నిరుద్యోగాన్ని రూపుమాపేస్తాం అని వాగ్దానలు చేస్తారు. అంతే తప్ప వాటిని నిలబెట్టుకునే ప్రయత్నం మాత్రం చెయ్యరు. అన్నీ ఊకదంపుడు ఉపన్యాసాలే. అందుకే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిపోతున్నా, మనదేశం దారిద్ర్య నిర్మూలన విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగా ఉంది. నేటికీ కోట్లాది కుటుంబాలు పేదరికపు పెనుబెబ్బులి కోరల మధ్య నలిగిపోతున్నాయి. దేశంలో అందరూ సుఖంగా జీవించాలన్న ప్రజల ఆకాంక్ష, మాత్రం ఏళ్ళ తరబడిగా ఒక 'నెరవేరని కల'గానే మిగిలిపోతోంది.

### పేదరిక నిర్మూలనకి దారులనేకం..!

మన నేతలు గట్టిగా అనుకోవాలే గానీ, పేదరిక నిర్మూలనకు దారులెన్నో ఉన్నాయి. కానీ ఆలోచించే నేతలే కరువయ్యారు. అయితే ఓ రకంగా చూస్తే, గతంలో కంటే ఇప్పుడు దేశ పరిస్థితి కొంత మేలు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ఆలోచనా విధానాల వల్ల ఇటీవలికాలంలో దేశ ఆర్థికవృద్ధిలో మంచి పురోగతి కనిపిస్తుండడం ఓ శుభపరిణామం. దీనివల్ల కొంతలో కొంత ప్రయోజనం ఉంటుందనడానికి సందేహం అవసరంలేదు. దేశ ఆర్థికవృద్ధిని బాగా పెంచడం ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ఆర్థిక నిపుణులు కూడా స్పష్టం చేస్తున్నారు. అంతేకాదు, దాంతోపాటు ఉపాధి అవకాశాలను పెంచడం, కుల వివక్షతను నివారించడం, అసలైన పేదలకి అవసరమైన చేయూతను అందించడం కూడా ముఖ్యం. గతంలో గ్రామాలలో 'ఏదైనా పనుంటే ఇప్పించండి బాబయ్యా' అని ఇళ్ళవద్దకి వచ్చి బ్రతిమిలాడే వారు. అంతేకానీ, అన్నం పెట్టమని అడిగేవారు తక్కువ. పనుంటే చేసుకు బతుకుతామనే ఆత్మవిశ్వాసం వారిలో కనిపించేది. ఇప్పటికీ అలాంటి ఆత్మాభిమానం కలిగిన వారికి మనదేశంలో కొదవ లేదు. కానీ ప్రస్తుతం అలాంటివారు చాలామంది పని లేదా ఉద్యోగం లేదా ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. పని దొరకని పురుషులు, ఆర్థిక సమస్యలతో అష్టకష్టాలు పడుతున్న మహిళలు, గృహిణులు, పూట గడవని చిన్నారులూ ఇప్పటికీ కోటానుకోట్ల మంది మన దేశంలో వున్నారంటే అతిశయోక్తి కాదు. మహిళలకు ఆర్థిక సాధికారత మాటల్లోనే వినపడుతోంది కానీ, అదింకా వంటింటి దాకా చేరలేదు. సామాన్య గృహిణులు సైతం నిత్యం ఆర్థిక కష్టాలతోనే అల్లాడుతున్నారు.

### భావితరాలకి సైతం 'వారసత్వం'గా పేదరికం..!

మనదేశంలో పేదరికం వల్ల మంచి చదువులు కరువైపోవడం ఫలితంగా పేద కుటుంబాల పిల్లలు పెద్ద ఉద్యోగాలు పొందలేకపోవడం సర్వసాధారణమైపోయింది. కాయకష్టం చేసుకుని బతికే కష్టజీవులు, కోటానుకోట్ల మంది అసంఘటిత కార్మికులకి పేదరికం ఒక పెద్ద శాపంగా మారింది. బతికినంత కాలం కష్టాలే. చదువుకోవడమంటేనే ఒక పెద్ద ప్రహసనంగా మారింది. ఒకవేళ కష్టపడి పెద్ద చదువులు చదువుకున్నా, ఉద్యోగాలు దొరకని వారు కోకొల్లలు. ఒకవేళ ఉద్యోగం దొరికినా తక్కువ జీతాలకే పనిచేసే వారికి కూడా కొదవే లేదు. ఇంట్లో ఇద్దరు ఉద్యోగాలు చేస్తున్నా, వారి సంపాదన కుటుంబ అవసరాలకే సరిపోవడం లేదు. ఆ స్థాయిలో అన్నీ ధరలూ ఆకాశామే హద్దుగా పెరిగిపోతున్నాయి. ఇలాంటి తరుణంలో వారికి కానీ, ఆ కుటుంబాలకి కానీ తిరోగమనమే తప్ప పురోగమనం అన్నది గగనమే. దీంతో వారి వారసులు కూడా పేదరికంలోనే జీవించాల్సి వస్తోంది. అలా క్రమేణా పేదరికమే వారసత్వంగా అదే ఒక 'ఆస్తి'గా భావితరాలకి లభిస్తుండడం బాధాకరం.

### మేరా భారత్ మహాన్.. అనేలా!

ప్రపంచమంతా ఆధునిక కలల లోకంలో విహరిస్తుంటే, మనదేశంలో మాత్రం ఇంకా ఆకలి కేకలు వినపడుతుండడం ఎంత బాధాకరమో నాయకులు గమనించాలి. ఈ దుస్థితి పోవాలంటే ప్రభుత్వ పెద్దల ఆలోచనా విధానం మారాలి. సంక్షేమ పథకాల పేరుతో చేస్తున్న ఉచిత పందేరాలకి స్వస్తి పలకాలి. అలాంటి పథకాల్ని కేవలం విద్య, వైద్యం వరకే పరిమితం చేయాలి. ప్రజల ఆర్థిక స్థితిగతులలో మార్పు తెచ్చే దిశగా పాలకులు పావులు కదపాలి. పేదరిక నిర్మలనని కేవలం ఎన్నికల వాగ్దానంగా పరిగణించకూడదు. అధికారంలోకి వచ్చాక చేసిన వాగ్దానంపై దృష్టి పెట్టాలి. పేదరిక నిర్మలనే లక్ష్యంగా కొన్ని దేశాలు ఆచరిస్తున్న విధానాలని మన వాళ్ళు అధ్యయనం చేయాలి. పేదల బతుకులు మార్చడమే ధ్యేయంగా శాశ్వత పరిష్కార మార్గాలని అన్వేషించి ప్రణాళికా బద్ధంగా వాటిని ఆచరించాలి. ఆర్థిక అసమానతతో నలిగిపోతున్న భారత్‌ని సర్వజన సమానత్వంతో వెలిగిపోయేలా పటిష్ట పునాదులు వేయాలి. అలా జరిగినప్పుడే 'మేరా భారత్ మహాన్' అని ప్రతి భారతీయుడూ గర్వంగా చెప్పుకుంటాడు...!

- రాజశ్రీ

# దేవుని సేవ దొరకడం మహాభాగ్యం!

## • రామతీర్థం పాలకమండలి సభ్యులతో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



దేవుని సేవ దొరకడం మహా భాగ్య మని కోవూరు శాసనసభ్యురాలు..తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఇటీవల విడవలూరు మండలంలోని రామతీర్థంలో వెలసివున్న ప్రసిద్ధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో జరిగిన ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె పాల్గొని పాలకమండలి సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నిస్వార్థంగా, సేవాభావంతో ఆలయ అభివృద్ధికి పాటు పడాలన్నారు. స్వామివారి ఆస్థుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం అతిరాల సురేష్ కృష్ణ ఛైర్మెన్‌గా, 11మంది సభ్యుల నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు.

# సంపన్నులు సమాజసేవలోకి రావాలి



సంపన్నులు ప్రజాసేవలోకి రావాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ అన్నారు. ఇందుకూరుపేటలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో రెడ్డి ల్యాబ్స్ వారు అందచేసిన ఫిజియోథెరఫి, డెంటల్ పీడియాట్రిక్ తదితర విభాగాలకు సంబంధించి రూ. 40 లక్షల విలువ చేసే వైద్య పరికరాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా గెలుపొందాక కోవూరు నియోజకవర్గంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేపట్టామని తెలిపారు.

### త్వరలోనే 'విపిఆర్ నేత్ర'

విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్వరలో 'విపిఆర్ నేత్ర' అనే బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఉదయగిరి నుంచి ప్రారంభించి, ఆ తర్వాత కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. అవసరమైన వారికి కళ్ళకు సంబంధించిన శస్త్ర చికిత్సలు కూడా చేయిస్తామన్నారు. తీర ప్రాంతమైన మైపాడు పరిసర గ్రామాల మత్స్యకారుల వైద్య సేవల కోసం, శిథిలావస్థకు చేరిన మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీ వేమిరెడ్డి సహకారంతో 3 కోట్ల 50లక్షల రూపాయల నిధులతో త్వరలోనే ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు ప్రశాంతమ్మ ఈ సందర్భంగా చెప్పారు.

### జీఎస్టీ ఫలాలు అందరికీ అందాలి

జీఎస్టీ సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆకాంక్షించారు. ఇందుకూరుపేటలోని వ్యాపారస్థులు, రైతులకు ఆమె ఇటీవల జీఎస్టీ ప్రయోజనాలను వివరించారు. ట్రాక్టర్లపై 12శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గడం వ్యవసాయ రంగానికి, ఆక్వా రంగానికి చెందిన ఇన్‌పుట్స్‌పై 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించడంతో ఆక్వా రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు.





# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న లోకేష్

## • రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి ప్రశంస

టీడీపీ యువనేత, విద్యామంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మెగా డీఎస్సీ నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమందికి ఉపాధ్యాయ ఉద్యోగావకాశాలు కల్పించారని నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రశంసించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో డీఎస్సీకి ఎంపికైన 75 మందిని ఈనెల 19న ఆయన తన కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ పరీక్షలు నిర్వహించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అందులో కీలకపాత్ర పోషించిన లోకేష్‌కి నెల్లూరు రూరల్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. యువతకు ఉద్యోగకల్పన కోసం భారీ పరిశ్రమలను కూడా తెస్తున్నారని, దీంతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆయనన్నారు. ప్రతిష్టాత్మకమైన గూగుల్ రాకతో ఏపీకి మరింత విఖ్యాతి వస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి, విద్యామంత్రి లోకేష్‌ల కృషితో రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామి అవుతుందని ఆయన ఆకాంక్షించారు. గత ప్రభుత్వం మెగా డీఎస్సీని విస్మరించిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# రమాదేవి ఔదార్యం ఎనలేనిది!

## పుట్టినరోజు వేడుకల్లో టీడీపీ మహిళా నేతల కితాబు



మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి పేదల పట్ల ఔదార్యంతో ఉంటారని, ఆమె మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని నెల్లూరు నగరంలోని టీడీపీ మహిళా నాయకురాళ్లు ఆకాంక్షించారు. రమాదేవి పుట్టినరోజు వేడుకలు ఇటీవల నెల్లూరు నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. టీడీపీ మహిళా కార్యకర్తలు, ముఖ్య నేతలు భారీ కేక్ కట్ చేసి, రమాదేవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గత ఎన్నికల్లో పొంగూరు నారాయణ గెలుపులో రమాదేవి కీలకంగా పనిచేశారని, రమాదేవి దాతృత్వానికి మారుపేరని, నిరుపేదలంటే అభిమానమని, కార్యకర్తలంటే ఎంతో గౌరవమని వారు పేర్కొన్నారు. వీధి వ్యాపారుల జీవనోపాధికి తోపుడు బండ్లు ఇచ్చే ఆలోచన కూడా రమాదేవిదేనని వారు తెలిపారు. అనంతరం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలుచేసి, టెంకాయలు కొట్టి రమాదేవిపై తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# పోలీసు అమరవీరుల త్యాగాలు అమూల్యం!

## • సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్, ఎస్పీల నివాళి

పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. ఈనెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా, జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆధ్వర్యంలో నెల్లూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, పోలీసు అమర వీరుల త్యాగాలను కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల భద్రతే లక్ష్యంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల త్యాగనిరతి ఏనాటికీ మరచిపోలేనిదన్నారు. వారి కుటుంబాలకు దేశమంతా తోడుగా ఉందన్నారు. అనంతరం వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున చేయూతగా చెక్కులు బహుకరించారు. తొలుత సంస్మరణ స్థూపం వద్ద, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు అమరవీరుల కుటుంబసభ్యులు పోలీసు లాంఛనాలతో ఘన నివాళి అర్పించారు.

### అండగా ఉంటాం - ఎస్పీ అజిత

జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల మాట్లాడుతూ, పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎప్పుడూ అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. దేశం స్వేచ్ఛగా, స్వాతంత్ర్యంగా ఉండడానికి పోలీసుల విరోచిత పోరాటాలే కారణమన్నారు. తమ జీవితాలను సైతం పణంగాపెట్టి దేశ సరిహద్దుల్లో మనందరి భద్రత కోసం పోలీసు జవాన్లు అహర్నిశలు పహారా కాస్తుంటారని తెలిపారు.



కేవీఆర్ పెట్రోలు బంకు వరకు నిర్వహించిన ర్యాలీ, మానవహారంలో ఎస్పీ, కలెక్టర్, అడిషనల్ ఎస్పీ సౌజన్య, డిఎస్పీలు శ్రీనివాసరావు, శ్రీధర్, శ్రీనివాసరావు, వేణుగోపాల్, రామారావు, చంద్రమోహన్, ఏఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కష్టాలపై సీపీఎం నిరసన

నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో ట్రాఫిక్ పెరిగిపోయి అటు ప్రజలు, ఇటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ సీపీఎం నెల్లూరురూరల్ శాఖ నాయకులు ఇటీవల నిరసన చేపట్టారు. వనంతోపు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని, ట్రాఫిక్ సిబ్బందిని ఈ ప్రాంతంలో నియమించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఆందోళనలో సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, పి.శ్రీనివాసులు, రఘురామయ్య, రమణయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు గంగ ప్రత్యేక కలెక్టర్‌గా.. మౌర్య

తెలుగు గంగ ప్రత్యేక కలెక్టర్‌గా తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య నియమితులయ్యారు. ఇటీవల ఆమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# 30న..జడ్పీ సమావేశం

నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30న నిర్వహించాలని నిర్ణయించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో జడ్పీ సీఇఓ మోహన్‌రావు మంగళవారం నాడు సమావేశమై ఆ తేదీని ఖరారు చేశారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ప్రధానంగా వ్యవసాయం, నీటిపారుదల, వైద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, రహదారులు-భవనాల శాఖల పురోగతిని సమీక్షించాలని భావిస్తున్నారు.

# అక్రమాల అధికారులపై చర్యలు తీసుకోండి

**సీపీఐ డిమాండ్**

జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణాకి సహకరిస్తున్న అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి షేక్ షానవాజ్ డిమాండ్ చేశారు. ఈనెల 19న నెల్లూరులోని సీపీఐ కార్యాలయంలో రైతు సంఘాల నాయకులతో కలసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలోని కొన్ని రైస్‌మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచిపెట్టి, అధికారుల సహకారంతో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై కమిటీ వేసి విచారణ జరిపించాలన్నారు.

# నెల్లూరు కబుర్లు

## 'పురమిత్ర' ద్వారా..ఆన్‌లైన్ సేవలు

రాష్ట్ర పురపాలకశాఖ ఇటీవల రూపొందించిన 'పురమిత్ర' యాప్ ద్వారా మునిసిపల్ ఆన్‌లైన్ సేవలు సులభతరం అవుతాయని నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ ఈనెల 21న ఒక ప్రకటనలో తెలిపారు. ఆ యాప్ ద్వారా ఆస్తి పన్ను చెల్లింపు, తాగునీటి కుళాయి పన్ను, ట్రేడ్ లైసెన్సు, ప్రాపర్టీ మ్యుటేషన్ ఫీజు, లీజ్‌లు అగ్రిమెంట్లు, ప్రకటనల పన్నులు వగైరాలను సులభంగా చెల్లించవచ్చన్నారు. అంతేకాక, పారిశుద్యం, తాగునీటి సరఫరా, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్, విద్యుత్ దీపాల సౌకర్యం, రెవిన్యూకి సంబంధించిన సమస్యలేమైనా ఉంటే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీరప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, ఎవ్వరూ సముద్రంలోకి వెళ్లవద్దని ఆర్డీవో అనూష ఈ నెల 21న ఒక ప్రకటనలో తెలిపారు. వరదలు, నీటి మునక పరిస్థితులు సంభవిస్తే.. తక్షణ సహాయం కోసం సమీప సచివాలయాల అధికారులతో ఫోన్‌లో సంప్రదించాలన్నారు. నెల్లూరు డివిజన్ పరిధిలో ఆ సిబ్బంది 24 గంటలూ పని చేస్తారని, డివిజన్ స్థాయిలో కంట్రోల్‌రూమ్ కూడా ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

## ఉద్యోగులను దగా చేస్తున్న ప్రభుత్వం

### ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ఆరోపణ



రాష్ట్రంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలు పదవీ విరమణ సమయంలో ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించకుండా దగా చేస్తోందంటూ ఎమ్మెల్సే పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల ఆయన నగరంలోని వైసీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నాలుగు పెండింగ్ డీఏల్లో ఒక్కటి మాత్రమే ఇస్తూ ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన విమర్శించారు. మొత్తం డీఏ బకాయిలను దశలవారీగానైనా చెల్లించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## క్రీడా అవార్డులకు ..దరఖాస్తు చేసుకోండి

2025వ సంవత్సరానికి కేంద్ర క్రీడలు, యువజన సర్వీసులశాఖ వారు క్రీడా అవార్డులు అందజేసేందుకు నిర్ణయించారు. అర్హులైన శిక్షకులు, క్రీడాకారుల నుంచి ఆమేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఎస్‌డీఓ ఆర్‌కె యతిరాజ్ ఈనెల 21న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అర్జున అవార్డు, అర్జున లైఫ్‌టైమ్ అవార్డు, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు, ద్రోణాచార్య అవార్డు, ద్రోణాచార్య లైఫ్‌టైమ్ అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం అందజేస్తారని, అర్హత కలిగినవారు ఈనెల28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.






## ఘనంగా దీపావళి



దీపావళి పర్వదినాన్ని సోమవారం నాడు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో మహాలక్ష్మి పూజలు, శివాలయాల్లో కేదారేశ్వర వ్రతాలు, అర్చనలు అభిషేకాలు జరిగాయి. నెల్లూరు నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం, శివాలయం, శ్రీ రంగనాథ స్వామి దేవాలయం తదితర ప్రముఖ దేవాలయాల్లో దీపావళిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, సేవలు నిర్వహించారు.

## కన్నులపండువగా..శ్రీ రంగనాథుని కల్యాణం



నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవాలయంలో ఈనెల 19న శ్రీ రంగనాథుని కల్యాణోత్సవం జరిగింది. కేసీ దాస్ స్మారక సేవా సంస్థకు ఆధ్యాత్మిక అనుబంధసంస్థ అయిన సనాతన ధర్మవారధి వ్యవస్థాపకులు ధర్మాచార్య.. బ్రహ్మశ్రీ కల్వకొలను శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో, ఆలయం చెంతనే ఉన్న శ్రీ రంగనాథస్వామి కల్యాణ మండపంలో శ్రీ రంగనాయకి అమ్మవారు–ఆండాళ్ అమ్మవారి సమేత శ్రీ రంగనాథస్వామికి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవ విశిష్టతను, నిత్యపూజా విధానాన్ని ఆయన భక్తులకు వివరించారు. ఆ తర్వాత స్వామివారికి–అమ్మవార్లకు నేత్రపర్వంగా పుష్పయాగం చేశారు. ఈ వేడుకకు స్వామివారి భక్తులు ఖండవల్లి రాధాకృష్ణ, పాటూరు రవికిరణ్, వేములపాటి నవీన్, పోరూరి శ్రీనివాసరావు సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

## వైభవంగా కార్తీక మాస పూజలు

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామివారికి కార్తీకపూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 21 నుంచి వచ్చేనెల 18వ తేదీ వరకు ఈ మాస పూజలు కొనసాగుతాయి.

### శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి

## త్వరలోనే మహర్దశ



నెల్లూరు, మూలాపేటలో వెలసివున్న శ్రీ రుక్మిణీ సత్యభామాదేవి సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి దేవాలయానికి త్వరలోనే మహర్దశ రాబోతోంది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా గుడి నిర్మాణం చేసేందుకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల ఆలయంలో గ్రామసభ కూడా జరిగింది. దేవాదాయశాఖ అధికారులు, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంతోకాలంగా ఆనం కుటుంబం ఆలయానికి ట్రస్టీగా కొనసాగుతోందని, వారి హయాంలో ఆలయం ఎంతో అభివృద్ధి చెంది స్వామివారి ఆస్తులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారి చంద్రశేఖర్ ఆజాద్, రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పి.పరమేశ్వరప్ప, కర్నూలు సూపరిండెంట్ ఇంజనీర్ ఎస్.సతీష్, గుంటూరు డివిజనల్ ఇంజనీరు సిహెచ్ శ్రీనివాసులు నెల్లూరు ఏఈ మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలతో ఏకాంతంగా 'వన్ టు వన్'

### అందరి సమస్యలు వింటున్న.. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభ్యున్నతే ధ్యేయంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గ కార్యకర్తలతో చేపట్టిన 'వన్ టు వన్' కార్యక్రమం నిరంతరం జరుగుతూనే ఉంది. ఒక్కొక్క కార్యకర్తతో సుమారు 15 నిమిషాలపాటు ఎమ్మెల్యే ఏకాంతంగా మాట్లాడుతూ వారి సమస్యలు వింటున్నారు. పార్టీకి సంబంధించిన సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులతో పాటు వారి కుటుంబ సభ్యుల కష్టాలు కూడా తెలుసుకుని, ఎంతో ఓపికతో అక్కడికక్కడే ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడంతో కార్యకర్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు 700 మంది కార్యకర్తల కష్టనష్టాలన్నీ విన్నారు. ఇటీవల ఒక్కరోజే 57 మంది కార్యకర్తలతో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఒకరి తర్వాత మరొకరుగా (వన్ టు వన్) కార్యకర్తలు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ, మనసు విప్పి వారి బాధలు చెప్పుకుంటున్నారు కూడా. నెల్లూరు నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలతో ఆత్మీయంగా మాట్లాడే ఈ కార్యక్రమం ఇంకా మరికొన్ని రోజులు కూడా కొనసాగుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

### రామలింగాపురం తరహాలో..

## మాగుంట లేఔట్‌లో అండర్ బ్రిడ్జ్



నెల్లూరులోని రామలింగాపురం అండర్‌బ్రిడ్జి తరహాలో స్థానిక మాగుంట లేఅవుట్‌లో కూడా అండర్ బ్రిడ్జి ఏర్పాటుచేస్తామని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 22న మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జ్ వద్ద 13.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఫుట్ పాత్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ పనులను నెలరోజుల్లోనే పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, క్లస్టర్ ఇంచార్జ్ నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి, కో క్లస్టర్ ఇంచార్జ్ విష్ణుప్రియ, 19వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### చురుగ్గా సహాయక చర్యలు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని అనేక ప్రాంతాలలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనలతో నియోజకవర్గ పరిధిలోని 23 మరియు 25వ డివిజన్‌లలో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను స్థానిక కార్పొరేటర్, నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. నియోజకవర్గం ప్రజలకు ఏ అవసరం వచ్చినా, ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు అందుబాటులోకి వస్తామని, ప్రజల సేవలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ఆయన ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు తెలిపారు.

## టెన్త్ ఉత్తీర్ణతలు పెంచాలి

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణతలు సాధించేందుకు ఉపాధ్యాయులు, ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి సూచించారు. ఈనెల 21న ఆయన నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నెల్లూరు నగర, రూరల్ మండల ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. గత నాలుగేళ్ళుగా సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణత కాని పాఠశాలల వివరాలు పరిశీలించి, ఆయా పాఠశాలల్లో ఉత్తీర్ణత పెంపుదలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

# 10 కోట్లతో.. వెంగమాంబ దేవాలయం అభివృద్ధి

• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఈనెల 22 బుధవారం నాడు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దుత్తలూరు మండలం నర్రవాడలోని వెంగమాంబ దేవాలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఈ దేవాలయాన్ని గొప్ప క్షేత్రంగా, పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణం, ఆలయ శాశ్వత కట్టడాలు, రాజగోపురాల ఏర్పాటు తదితర నిర్మాణాలకు దేవాదాయశాఖ ఇంజనీర్లు సుమారు 10 కోట్లతో అంచనాలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆలయ పరిసరాల్లో రెవెన్యూ భూములను సర్వే చేయించి, సర్వేమ్యాప్‌లను కూడా తయారు చేసి, ఆ మేరకు ఆలయ పరిసరాలను పర్యాటకంగా కూడా అభివృద్ధి చేస్తామన్నారు. దేవాదాయశాఖ ఆర్‌జెసి ఆజాద్, అసిస్టెంట్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### 111 మందికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు :

ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని 111 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 85.50 లక్షలు విలువైన సీఎం రిలీఫ్ పండ్ చెక్కులను ఆయా మండలాల కన్వీనర్లతో కలిసి మంత్రి రామనారాయణరెడ్డి ఇటీవల లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం, మున్సిపల్ కార్మికులు 125 మందికి 6 లక్షల విలువైన కిట్లను అందజేశారు.

### 'సూర్య ఘర్'ని సద్వినియోగం చేసుకోండి

పీఎం సూర్యఘర్ పథకాన్ని ఆత్మకూరు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆనం పిలుపునిచ్చారు. ఇటీవల ఆత్మకూరు పట్టణంలోని ఒక ఇంటిపై ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్స్‌ను మంత్రి స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గానికి సుమారు 10వేల పైగా సోలార్ యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు.

### విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ



స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇటీవల మంత్రి ఆనం ఆంజనేయస్వామి గుడి సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. త్వరలోనే 5 ఎకరాల స్థలంలో కొత్తగా డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయనున్నామని మంత్రి చెప్పారు. అనంతరం పలుచోట్ల మొక్కలు నాటారు. విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీని ప్రారంభించి ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కోటి రూపాయలతో.. గుండెమడకలలో గుడి



వింజమూరు మండలం గుండెమడకల గ్రామంలో శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయానికి ఈనెల 22న మంత్రి ఆనం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కోటి రూపాయల టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఈ గ్రామంతో ఆనం కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని, ఈ ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు. సోమశిల - ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ ద్వారా మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరు మండలాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి ఆనం ఈ సందర్భంగా చెప్పారు. సోమశిల హైలెవల్ కెనాల్‌పై 5 రిజర్వాయర్లు ఉండగా ఆరో రిజర్వాయరుగా గుండెమడకలను ఎంపిక చేశామన్నారు. అన్ని రిజర్వాయర్లను పూర్తి చేసి మెట్టప్రాంతాలకు నీరందిస్తామని చెప్పారు.

## జీఎస్టీ2.0తో.. ప్రజలకు భారీ ఊరట



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిగించిన జీఎస్టీ వెసులుబాటు వల్ల తగ్గిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలకు భారీ ఊరట కలిగిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఆత్మకూరు పట్టణంలో జీఎస్టీ సంస్కరణల వలన కలిగిన ప్రయోజనాలు ప్రజలకు వివరించేందుకు జీఎస్టీ, రవాణా శాఖల ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన భారీ ర్యాలీని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ, ట్రాక్టర్లు, ట్రాక్టర్ పరికరాలపై 18శాతం ఉన్న జీఎస్టీని 5శాతానికి తగ్గించినట్లు చెప్పారు. రవాణా రంగంలో జీఎస్టీ సంస్కరణలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని, ఒక్కొక్క వాహనంపై 8 వేల నుంచి రెండు లక్షల వరకు తగ్గింపు ఉంటోందన్నారు. స్కూటర్లు, బైక్‌లు, కార్ల ధరలు కూడా బాగా తగ్గాయన్నారు. తొలుత, జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ చందర్ జీఎస్టి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, ఆర్డీవో పావని, కమిషనర్ గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వానలతో జాగ్రత్త!

➢ కలెక్టర్ హెచ్చరిక

ఈ నెల 23 నుంచి 25 వరకు భారీ నుండి అతి భారీ వర్షాల ప్రభావం అధికంగా ఉండనున్న నేపథ్యంలో అధికారులను, ప్రజలను అప్రమత్తం చేస్తూ.. ప్రజలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై బుధవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈనెల 22న ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించాలని, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. చెరువులు, కాల్వలు, ప్రాజెక్టుల వద్ద సిబ్బందిని ఉంచి, ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని తనకు తెలియచేయాలన్నారు. ప్రజలు కూడా ముందు జాగ్రత్తలతో, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని కోరారు.

## 15వందల విద్యుత్ బస్సులు

రాష్ట్రానికి త్వరలో 15వందల విద్యుత్ బస్సుల వస్తాయని ఆర్టీసీ నెల్లూరు రీజనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21న ఆయన కావలి పట్టణంలోని ఆర్టీసీ డిపోలో పొరుగుసేవల కార్మికులకు రెయిన్‌కోట్లు, యూనిఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య బాగా పెరిగిందన్నారు. వాయు కాలుష్యాన్ని అధిగమించేందుకు విద్యుత్ బస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.



## మంత్రి నారాయణ చేతులమీదుగా...

# తిరుమలశెట్టి కుటుంబానికి..చెక్కుల పంపిణీ

ఇటీవల కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండలం దారకానిపాడు గ్రామంలో హత్యకు గురైన తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు కుటుంబానికి బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. లక్ష్మీనాయుడి కుటుంబసభ్యులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను మంత్రి నారాయణ నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. లక్ష్మీనాయుడు భార్య సుజాతకు 5 లక్షల రూపాయల చెక్కును, కుమార్తెలు లహన్వి శ్రీ, తన్వి శ్రీలకు 5 లక్షల రూపాయలు వంతున, తిరుమలశెట్టి భార్గవ నాయుడుకి 3 లక్షలు, తిరుమలశెట్టి పవన్‌కుమార్‌కు 5 లక్షల రూపాయల వంతున సాయంగా ఆ చెక్కులను అందజేశారు. అనంతరం, మంత్రి నారాయణ మాట్లాడుతూ లక్ష్మీనాయుడు హత్య ఉదంతంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తక్షణమే స్పందించి హోంశాఖ మంత్రి అనితను, తనను, మరో శాసనసభ్యుడిని ఆ సంఘటన విచారణకు కమిటీగా నియమించారన్నారు. కమిటీ తుది నివేదిక ప్రకారం లక్ష్మీనాయుడు కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారన్నారు. అందులో భాగంగా నగదుతో పాటు వారి కుటుంబసభ్యులకు రెండు ఎకరాలు వంతున మొత్తం ఆరు ఎకరాల భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అంతేకాక పిల్లల చదువుల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఆ దారుణ హత్యాకాండలో వెన్నుపూసకు దెబ్బ తగిలి ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్న తిరుమలశెట్టి పవన్‌కుమార్‌కు ఐదు లక్షల రూపాయలు, నాలుగు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని తెలిపారు. గాయలతో బాధపడుతున్న తిరుమలశెట్టి భార్గవనాయుడుకు మూడు లక్షల రూపాయలు ఇచ్చామన్నారు. ఆ హత్య కేసుపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటుచేసి వీలైనంత త్వరగా నేరస్తులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## భూగర్భ డ్రైనేజీకి.. 165 కోట్లు విడుదల



నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ కోసం రూ.165 కోట్లు విడుదలైనట్లు రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ చెప్పారు. ఈనెల 22న ఆయన నెల్లూరులోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమావేశమై, జిల్లాలో కురుస్తున్న భారీ వానల పరిస్థితిని సమీక్షించారు. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. దగదర్తిలో విమానాశ్రయానికి త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అదేవిధంగా కోవూరు చక్కెర ఫ్యాక్టరీ దగ్గర పరిశ్రమ ఏర్పాటు చేసి వేలాది మందికి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. జిల్లా అంతా భారీవర్షాలు కురుస్తున్నాయని, ఆత్మకూరులో అత్యధికంగా 146.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తెలిపారు. వానలెంత భారీగా కురిసినా, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా మేడలు కడితే కూల్చడం ఖాయమన్నారు. పంట కాలువల ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కరేడులో..
# వేగవంతంగా భూసేకరణ

### భూములు కోల్పోయిన వారికి ప్రభుత్వం భరోసా

కందుకూరు నియోజకవర్గం కరేడు గ్రామంలో త్వరలోనే పరిశ్రమల ఏర్పాటు కానుండడంతో ఆ గ్రామం రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. అక్కడ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం వేగవంతంగా భూసేకరణ చర్యలు తీసుకుంటోంది. దీంతో, భూములు కోల్పోయిన వారికి భరోసా ఉంటుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా స్పష్టం చేశారు. కరేడులో పరిశ్రమల ఏర్పాటు, భూసేకరణలకి సంబంధించి ఆయన ఈనెల 21న ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసర మైన భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని, మొత్తం సుమారు 4800 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, ఇప్పటి వరకు 672.279 ఎకరాలకు సంబంధించి రైతులకు అవార్డు అనుమతించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇందులో తాజాగా 79.745 ఎకరాలకు సంబంధించి అవార్డు పాస్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

దీంతో, తాము ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు జీవనోపాధులు స్థిరపడతాయని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. భూసేకరణకు ప్రభుత్వానికి సహకరిస్తూ, ఈ ప్రాంత అభివృద్ధికి ముందుకొస్తున్న రైతులకు కలెక్టర్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉపాధి, ఉద్యోగాలు స్థానిక యువతకు లభించనున్నాయని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇది కేవలం కరేడుకు మాత్రమే కాకుండా, మొత్తం జిల్లాకు గొప్ప ఆర్థిక ఉన్నతి కలిగించనుందన్నారు.

## జిల్లాలో యూరియాకి
# కొరత లేదు

కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసాయ శాఖకు పూర్వ వైభవం వచ్చిందని, ప్రతి రైతుకు యూరియా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ఏర్పాటుచేసిందని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు యూరియా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కో ఎకరాకు 3 బస్తాల చొప్పున రైతులకు యూరియా అందజేస్తామని, అయితే యూరి యాను మితిమీరి వినియోగించవద్దని, శాస్త్రవేత్తలు చేస్తున్న సూచనలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. పట్టా భూములతో పాటు అసైన్డ్, సీజేఎఫ్ఎఫ్, అనాధీన భూములతో పాటు చెరువుల కింద సాగు చేసుకుంటున్న రైతులకు కూడా యూరియా అందిస్తామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 297 మంది రైతులకు రూ.2.42 కోట్ల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందజేశామని, ఇందులో వారికి రూ.1.35 కోట్ల సబ్సిడీ కూడా లభించిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో..
# కార్తీక మాస ప్రవచనాలు

పద్య సారస్వత పరిషత్ నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు కార్తీక మాస ప్రవచనాలు ఏర్పాటయ్యాయి. నెల్లూరు రేబాలవారివీధిలో పీటీజీ రాజ్ టవర్స్ వేదికగా జరిగే ఈ ఆధ్యాత్మిక ప్రవచనాలు ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి 8 గంటల వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. టవర్స్ కార్యదర్శి బి.జ్యోతిప్రసాద్, పద్యసారస్వత పరిషత్ అధ్యక్షులు పోలవరపు లక్ష్మీనరసింహారావుల సారధ్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలబోలు బలరామయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఉపన్యాసకులుగా ప్రముఖ సాహితీ వేత్తలు డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు, కుమారి సూరం అరుణ, శనగవరపు సత్యనారాయణ, శ్రీమతి గిరిజా కుమారి, శ్రీమతి ఓగిరాల శారదాంబ, డాక్టర్ కే.గిరిజాలక్ష్మి పాల్గొని పలు ఆధ్యాత్మిక అంశాలపై ప్రసంగిస్తారని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వా హకులు కోరారు.

# పాకిస్థాన్ స్వయంకృతాపరాధం

మనసులో మాట 68

2025 అక్టోబర్‌లో ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ సరిహద్దులో చెలరేగిన హింసాత్మక ఘర్షణలు కేవలం సరిహద్దు ఉద్రిక్తతలు కావు. అవి దశాబ్దాల పాటు పాకిస్థాన్ అనుసరించిన వికృత విదేశాంగ విధానం విషపూరిత ఫలితాలు. ఈ సంక్షోభం పాకిస్థాన్ సొంత తప్పిదమే తప్ప, బాహ్య శక్తులు సృష్టించింది కాదు. తమ అంతర్గత భద్రతా వైఫల్యాల నుంచి ప్రపంచ దృష్టిని మళ్లించడానికి, పాకిస్థాన్ అనవసరంగా భారతదేశాన్ని ఈ వివాదంలోకి లాగుతూ, తమ అసమర్థతను మరోసారి రుజువు చేసుకుంది.

పాకిస్థాన్ సైనిక వ్యవస్థ ఆఫ్ఘనిస్థాన్‌ను తమ వ్యూహాత్మక ప్రాంతంగా భావించింది. తమ ప్రధాన శత్రువుగా భావించే భారతదేశానికి వ్యతిరేకంగా ఉపయోగించడానికి ఆఫ్ఘన్ గడ్డపై తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని, ప్రాక్సీ శక్తులను (ముఖ్యంగా ఆఫ్ఘన్ తాలిబాన్‌ను) పోషించింది. ఐఎస్ఐ (ISI) ఇచ్చిన ఈ మద్దతు కారణంగానే తాలిబాన్ రెండు దశాబ్దాల పాటు అమెరికా బలగాలకు వ్యతిరేకంగా పోరాడి, చివరకు 2021లో విజయం సాధించింది. పాకిస్థాన్ ఈ విజయాన్ని తమ వ్యూహాత్మక విజయంగా భావించింది.

కానీ, అధికారం చేజిక్కించుకున్న తర్వాత ఆఫ్ఘన్ తాలిబాన్, పాకిస్థాన్ ఆశించి నట్లుగా పోషకుడికి విధేయుడైన బంటు లాగా వ్యవహరించడానికి నిరాకరించింది. చారిత్రక వైరుధ్యాలు ముందుకు వచ్చాయి. ప్రధానంగా, బ్రిటిష్ వలస పాలన వారసత్వంగా వచ్చిన డ్యూరాండ్ రేఖ (Durand Line) సరిహద్దును ఆఫ్ఘన్ తాలిబాన్ ఎప్పటికీ గుర్తించబోమని ప్రకటించింది.

ఆఫ్ఘన్ తాలిబాన్ విజయం వారి సైద్ధాంతిక మిత్రుడైన, పాకిస్థాన్‌కు శత్రువైన తహ్రీక్-ఏ తాలిబాన్ పాకిస్థాన్(TTP)ను ఉత్సాహపరిచింది. పాకిస్థాన్ అనుసరించిన "మంచి తాలిబాన్, చెడ్డ తాలిబాన్" అనే వైరుధ్య విధానం ఇప్పుడు పాకిస్థాన్‌లోనే హింసను పెంచడానికి టిటిపికి స్వేచ్ఛను ఇచ్చింది. నేడు పాకిస్థాన్‌లో వేలమంది భద్రతా సిబ్బంది, పౌరులు టిటిపి దాడులకు బలవుతున్నారు. ఇది టిటిపి బలం మాత్రమే కాదు, పాకిస్థాన్ దశాబ్దాల పాటు ఉగ్రవాద సంస్థలను పెంచి పోషించిన కర్మ ఫలితం అని విశ్లేషణలు స్పష్టం చేస్తున్నాయి.

### అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే భారత్‌పై నిందలు

టిటిపి దాడులకు అడ్డుకట్ట వేయాలని ఆఫ్ఘన్ తాలిబాన్‌పై ఒత్తిడి చేయడంలో విఫలమైన పాకిస్థాన్, తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి భారతదేశాన్ని నిందించే పాత వ్యూహాన్ని ఆశ్రయించింది. సరిహద్దు ఘర్షణలు జరుగుతున్న సమయంలోనే, ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి అమీర్‌ఖాన్ ముత్తకీ భారతదేశంలో పర్యటించి, దౌత్య సంబంధాలు పెంచుకోవాలని నిర్ణయించడం, పాకిస్థాన్ భయాలను పెంచింది.

వెంటనే, పాకిస్థాన్ రక్షణ మంత్రి, ఆఫ్ఘన్ తాలిబాన్‌ను "ఢిల్లీ స్పాన్సర్ చేస్తోందని" ఆరోపించడం కేవలం దృష్టి మరల్చడానికి చేసిన ప్రయత్నం. పాకిస్థాన్ ఆరోపణలకు ఏమాత్రం ఆధారాలు లేవు. ఆఫ్ఘన్ తాలిబాన్ కూడా వీటిని అసమంజసమైనవి, అసంబద్ధమైనవి అని కొట్టిపారేసింది. ఏ దేశంతో సంబంధాలు పెట్టుకోవాలో, ఏ దేశంతో ఎలా ఉండాలో నిర్ణయించుకునే స్థితిలో ఆఫ్ఘనిస్థాన్ ఉంది. ఇది పాకిస్థాన్ జీర్ణించుకోలేకపోతోంది. భారతదేశంతో ఆఫ్ఘన్ తాలిబాన్ సంబంధాలు పెరిగే సంకేతాలు కనిపించడంతో పాకిస్థాన్ తన ప్రాంతీయ ప్రభావం కోల్పోతున్నాననే భయానికి గురవుతోంది.

మరోవైపు చైనా ఒత్తిడితో కూడా పాకిస్థాన్ ఉక్కిరి బిక్కిరి అవుతోంది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (CPEC) పేరిట చైనా పాకిస్థాన్‌లో కొన్ని లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టింది. అయితే, టిటిపి ఉగ్రవాదం ఇప్పుడు ఆ ప్రాజెక్టు భద్రతకే పెను సవాలుగా మారింది. టిటిపి, ఇతర బలూచ్ తీవ్రవాద సంస్థలు తరచూ చైనా ఇంజనీర్లను, కార్మికులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. దీంతో, తమ పౌరులకు, పెట్టుబడులకు రక్షణ కల్పించడంలో పాకిస్థాన్ ఘోరంగా విఫలమవుతోందని చైనా తీవ్ర అసంతృప్తితో ఉంది.

### ముందు చూపు అవసరం

పాకిస్థాన్, టిటిపి ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ఆఫ్ఘనిస్థాన్ భూభాగంలో వైమానిక దాడులు చేయడం, ఆ దాడుల్లో సాధారణ పౌరులు, క్రికెటర్లు మరణించటం పాకిస్థాన్ చేసిన వ్యూహాత్మక తప్పిదమే. నిజంగా ఉగ్రవాదమే దానికి సమస్య అయితే ఉగ్రవాదంపై ఆ దేశం అనుసరిస్తున్న విధానంలో సమూల మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. భారతదేశానికి సంబంధించినంత వరకు ఒకలా, తన వరకు వచ్చేసరికి మరోలా విధానాలు ఉంటాయంటే అంతర్జాతీయ సమాజం నుంచి మద్దతు దొరకదు.

పాకిస్థాన్ ఈ సమస్య నుంచి బయటపడాలంటే, ఆఫ్ఘనిస్థాన్ అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకునే స్వభావాన్ని పూర్తిగా విడనాడాలి. తన సరిహద్దు భద్రతను బలోపేతం చేసుకోవడంలో ఉన్న అసమర్థతను ఒప్పుకుని, TTPని ఎదుర్కోవ డానికి రాజకీయ, సైనిక పరిష్కారాలను ఆశ్రయించాలి. నిజాయితీతో కూడిన చర్చలను ఆశ్రయించాలి.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**




### కరెంట్ కోసం రైతుల ఆందోళన

గత పదిరోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పొలాలకు సాగునీరు అందడం కష్టతరంగా మారిందని, వెంటనే విద్యుత్ సరఫరాని పునరుద్ధరించాలంటూ వింజమూరు మండలంలోని తక్కెళ్లపాడు, ఊటుకూరు పంచాయతీల పరిధిలో ఉన్న రైతులు ఈనెల 21న ధర్నా దోళన చేశారు. వింజమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట జరిగిన ఈ ఆందోళనలో రైతులు మాట్లాడుతూ, నారుమళ్ళకు నీరు పెట్టుకోవాల్సిన ఈ పరిస్థితుల్లో త్రీ ఫేస్ విద్యుత్ సదుపాయానికి అంతరాయం కలిగి పదిరోజులు గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రివేళల్లో పొలాల్లోకి వెళ్ళాలంటే భయపడాల్సి వస్తోందన్నారు. ఇకనైనా సంబంధిత విద్యుత్ లైన్‌మెన్ తదితర సిబ్బందితో సంప్రదించి వెంటనే విద్యుత్ సరఫరాని పునరుద్ధరించాలని వారు విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ నాగూర్‌వలీకి విజ్ఞప్తి చేశారు.

### మునిసిపల్ కార్మికుల సమస్యలు తీర్చాలి

రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ కార్మికుల సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఆత్మకూరులోని మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌ని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే నవంబరు 3నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామంటూ సమ్మె నోటీసు అందజేశారు. విధి నిర్వాహణలో మృతిచెందిన, పదవీ విరమణ పొందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబసభ్యు లకు ఉపాధి కల్పిస్తూ, వారిని ఔట్‌సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా, కార్మికులకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళన చేపట్ట నున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

### నూతన ఉపాధ్యాయులకు ఐడీ కార్డులు ఇవ్వాలి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొంది, కొత్తగా ఉపాధ్యాయ విధుల్లో చేరిన వారికి ఐడీ కార్డులు ఇవ్వాలని ఆత్మకూరు పట్టణంలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటీఎఫ్) నాయకులు కోరారు. ఇటీవల వారు ఆత్మకూరు సబ్ ట్రెజరీ కార్యాలయంలో అధికారులను కలిసి ఆమేరకు వినతి పత్రం సమర్పించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.గంగాధర్, మాజీ జిల్లా కార్యదర్శి బి.శివప్రసాద్‌రావు, నాయకులు ఎస్.మోహన్‌రావు, షేక్ ఖాదర్‌బాషా, మస్తాన్ షరీఫ్, వి.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలంటూ ఉపాధ్యాయుల దీక్ష

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని కోరుతూ నెల్లూరులోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ఇటీవల ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరాహార దీక్ష చేపట్టారు. బదిలీ అయిన వారిని రిలీవ్ చేయకపోవడంతో ఆ ఉపాధ్యాయులు మాన సికంగా ఎంతో ఇబ్బంది పడుతున్నారంటూ ఏపీటీఎఫ్ నేతలు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 2025 జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను గత నాలుగు నెలలుగా రిలీవ్ చేయకపోవడం దారుణమని నిరాహార దీక్షలో ఉన్న ఏపీటీఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 5వందల మంది ఉపాధ్యాయులు బదిలీ అయినా, అందులో 450 మందిని ఇంకా రిలీవ్ చేయలేదని, ఇకనైనా అధికా రులు ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని వారు కోరారు. నిరాహార దీక్ష చేస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి హజరత్‌కు వారు మద్దతు తెలిపారు. ఈ ఆందో ళనలో ఏపీటీఎఫ్ నాయకులు తిరుమలేష్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# దీపావళి వేళ..

# మాలేపాటి కుటుంబంలో అలముకున్న చీకటి



## బాబాయ్, అబ్బాయ్‌ల మరణంతో కన్నీటి పర్యంతమైన దగదర్తి



*విధి బలీయమైనది. ఎప్పుడు ఎవరిని ఎలా బలి తీసుకుంటుందో ఎవరికీ తెలియదు. దగదర్తిలోని మాలేపాటి కుటుంబాన్ని విషాదంలో ముంచుతూ, ఆ కుటుంబంలోని ఇద్దరు వ్యక్తుల్ని ఒకరి తర్వాత మరొకరుగా మృత్యువు కబళించింది. రెండురోజుల్లో ఇద్దరు ప్రముఖ నాయకులు, అందులోనూ ప్రజలకు ఎంతో ఆత్మీయంగా ఉండే బాబాయ్, అబ్బాయి మరణించడం జిల్లాలో సంచలనం కలిగించింది. ఈ విషాద ఘటనలు ప్రజలను కలచివేశాయి.*

తమ కుటుంబానికి చెందిన ఇద్దరు నేతలు హఠాన్మరణానికి గురికావడంతో ఆ కుటుంబం అవాక్కయిపోయింది. దగదర్తి కన్నీటి పర్యంతమయ్యింది. మాలేపాటి కుటుంబానికి చెందిన యువనేత భానుచందర్ గుండెపోటుతో మరణిస్తే, ఆయన అంతిమ క్రియలు జరిగేలోగానే, ఆయనకెంతో ప్రియమైన బాబాయి సుబ్బానాయుడు కూడా అనారోగ్యంతో కన్నుమూయడం విధి కాఠిన్యానికి నిదర్శనం. దీంతో, దీపావళి వేళ మాలేపాటి కుటుంబంలో చీకటి అలముకున్నట్లయ్యింది.

నెల్లూరుజిల్లా కావలి నియోజకవర్గం, దగదర్తిలో తెలుగుదేశం పార్టీకి తొలినుంచి కంచుకోటగా ఉన్న మాలేపాటి కుటుంబంలో తీరని ఘోరం ఇది. టీడీపీ ఉపాధ్యక్షునిగా, రాష్ట్ర ఆగ్రోస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్‌గా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడు (60) దగదర్తి మండలంలోనే కాక, కావలి నియోజకవర్గంలో టీడీపీకి చురుకైన నాయకులుగా ఉండేవారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు, కావలి నియోజకవర్గంలో టీడీపీకి ఆయనే పెద్దదిక్కుగా ఉన్నారు కూడా. సుబ్బానాయుడు తండ్రి మాలేపాటి రామానాయుడు 1990వ దశకంలోనే టీడీపీలో చురుకైన పాత్ర పోషించారు. తొలినుంచి మాలేపాటి కుటుంబమంటే టీడీపీ కుటుంబంగానే ఉండేది. ఈ నేపథ్యంలో దురదృష్టవశాత్తూ సుబ్బానాయుడుకి ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స చేసుకుంటున్నారు. ఆయన అన్న కుమారుడైన భానుచందర్ (39)కి చిన్నాన్న సుబ్బానాయుడంటే ఎంతో ఇష్టం. బాబాయికి నయంచేయించాలన్న తపనతో భానుచందర్ ఆసుపత్రి వద్దనే చిన్నాన్నకు సాయంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి భానుచందర్ గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. దీంతో మాలేపాటి కుటుంబం శోకసాగరంలో మునిగిపోయింది. భానుచందర్ అంతిమక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగానే, మరుసటి రోజు సోమవారం తెల్లవారుఝామున సుబ్బానాయుడు కూడా తుదిశ్వాస విడిచారు. ఒకదాని తర్వాత ఒకటిగా వచ్చిన మరణ వార్తలతో మాలేపాటి కుటుంబం తీరని షాక్‌కి గురైంది. తమకెంతో ఆప్తులైన బాబాయి అబ్బాయిల ఆత్మీయతను తలచుకుంటూ స్థానిక ప్రజలు వారి మృతికి కంటతడిపెట్టారు. ఇద్దరి నేతల అంత్యక్రియలు సోమవారం నిర్వహించారు. సుబ్బానాయుడు పార్టీకి, ప్రజలకు చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఆయన అంత్య క్రియలని ప్రభుత్వ లాంఛనాలతో జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అంత్యక్రియలకి హాజరయ్యారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, టీడీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, దగదర్తి, బోగోలు, కావలి మండలాలకి చెందిన నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు వీరిద్దరి అంత్యక్రియల్లో పాల్గొని తమ అభిమాన నాయకులకి కడసారి వీడ్కోలు పలికారు.

### ప్రముఖుల సంతాపం :

సుబ్బానాయుడి మృతి పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

### జిల్లా నేతల సంతాపం :

మంచి మనస్తత్వం, ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన సుబ్బానాయుడి ఆకస్మిక మరణం ఒక్క జిల్లాకే కాకుండా రాష్ట్ర తెలుగుదేశం పార్టీకే తీరని లోటుగా జిల్లా నేతలు పేర్కొన్నారు. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మునిసిపల్ మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావలి శాసనసభ్యుడు కావ్య కృష్ణారెడ్డి తమ సంతాపాన్ని ప్రకటించారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రముఖులు 24గంటలలో అనారోగ్యంతో అసువులు బాయడం విధి వైపరీత్యమే. మాలేపాటి కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## కేంద్ర పథకాలపై.. 24న సమీక్ష

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలపై 20 అంశాల కార్యక్రమం అమలు కమిటీ ఛైర్మెన్ లంకా దినకర్ ఈనెల 24న జిల్లాలో సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈనెల 21న ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఆమేరకు సమావేశం ఉంటుందని, కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న ఆరోగ్య, విద్యా రంగాలకు సంబంధించిన ప్రత్యేక పథకాలు, అమృత్ పథకం, జల్‌జీవన్‌మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల పురోగతి తదితర అంశాలను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షిస్తారని ఆయన వివరించారు.

---

**తిరుపతి జిల్లా గూడూరు డివిజన్**

## క్యాన్సర్ అవగాహనా సదస్సు



గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఈ నెల 18న రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు, కిమ్స్ హాస్పిటల్ సహకారంతో క్యాన్సర్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సాయి రూప మాట్లాడుతూ ఆహారపు అలవాట్లపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, ఆరోగ్యం సరిగా లేనప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సలహా తీసుకోవాలన్నారు. బి.పి, షుగర్ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరీ రాఘవరెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రామ్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులు దారుణం

➢ **కె.వి.పి.ఎస్.నాయకులు**



దళితులపై జరుగుతున్న దాడులు దారుణమని, వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కుల వివక్ష పోరాట సంఘం జిల్లా కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య అన్నారు. గూడూరు సి.పి.ఎం పార్టీ కార్యాలయంలో ఈనెల 19న కె.వి.పి.ఎస్ గూడూరు మండల మొదటి మహాసభ ఎంబేటి చంద్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని మారినా దళితుల సంక్షేమ పథకాలు నీరుగారుస్తున్నాయని, ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అడపాల ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బి.నారాయణ, కార్యదర్శిగా ఎంబేటి చంద్రయ్య, సహాయ కార్యదర్శిగా రాగిపాటి నారాయణ, ట్రెజరర్‌గా ఏకుల వెంకటరమణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సి.ఐ.టి.యు ఉపాధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, మున్సిపల్ సంఘం జిల్లా కార్యదర్శి వి.చెంగయ్య, ప్రాంతీయ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం

గూడూరులోని శ్రీ భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర దేవస్థానంలో ఆశ్వియుజ అమావాస్యను పురస్కరించుకొని ఇటీవల కేదారేశ్వర వ్రతం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని నోములు నోచుకున్నారు.

## కృష్ణావతారంలో అళఘునాథస్వామి



గూడూరు పట్టణంలోని శ్రీ అళఘునాథస్వామి దేవస్థానంలో స్వామివారు శ్రీదేవి అమ్మవారితో కలిసి కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాద్యాలతో స్వామికి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం నరకాసురుడి బొమ్మను దగ్ధం చేసి దీపావళి పండుగను టపాకాయలు కాలుస్తూ ఆనందంగా జరుపుకున్నారు. భక్తులు పూజా కార్యక్ర మాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## వాసవి మాతకి విశేషాలంకరణ

గూడూరు, బజారువీధిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దీపావళి పండుగ సందర్భంగా అమ్మవారికి దీపాలు మరియు గాజులతో విశేష అలంకరణ ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా పాదర్తి ప్రసాద్–సుప్రజా కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## అమిత్ షా పుట్టిరోజు వేడుకలు



భారతదేశ హోం మంత్రి అమిత్ షా పుట్టినరోజును పురస్కరించుకొని భారత్ వికాస్ పరిషత్ సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఇటీవల గూడూరు పట్టణంలోని బాలాజీ నగర్ సెంటర్ వద్ద జరిగిన ఈ వేడుకలో కేక్ కట్ చేసి, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అమిత్ షా ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయనకి శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు సేవా కార్యక్రమాలు చేశారు.

## ఎస్.ఐలు అటూ.. ఇటూ!..





గూడూరు వన్ టౌన్ ఎస్.ఐ, రూరల్ ఎస్.ఐలు తారుమారయ్యారు. గూడూరు వన్‌టౌన్ ఎస్సైగా పని చేస్తున్న కె.తిరుపతయ్య గూడూరు రూరల్ పోలీసుస్టేషన్ ఎస్సైగా, ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న ఎం.మనోజ్‌కుమార్ వన్‌టౌన్ ఎస్సైగా బదిలీ అయ్యారు. ఆమేరకు ఇరువురు ఇటీవల బాధ్యతలు చేపట్టారు.

## వృద్ధులకు మహిళా మండలి పలసరుకులు



ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరులోని సాయిరాం చారిటబుల్ ట్రస్ట్‌లో ఇటీవల లేబూరి మాధవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు పలసరుకులు పంపిణీ చేసి, భోజనాలు ఏర్పాటు చేశారు. మహిళా మండలి అధ్యక్షురాలు రోహిణి, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి.మాధురి, కార్యదర్శి ఎస్.లక్ష్మి, దాత జీవని, అనిత పాల్గొన్నారు.



• నక్కల కాలువలో వరద ఉధృతి

# సోమిరెడ్డి చొరవతో తప్పిన ముప్పు

ఒకవైపు భారీవానలు, మరోవైపు కాలువల్లో నీరు సాఫీగా పోకుండా అడ్డుగా ఉంటున్న గుర్రపుడెక్క మొక్కలు. దీంతో వెంకటాచలం మండలం అన్ర్రంవారికండ్రిగ వద్ద పొలాలు ముంపుకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. బుధవారం వరద ఉధృతి పెరిగి పొలాలు మునిగిపోయే దశలో స్థానిక రైతులు ఆ విషయాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దాంతో ఆయన వెంటనే అప్రమత్తమై ఆ కాలువలో గుర్రపుడెక్క ఆకును తొలగించాలని స్థానిక అధికారులకు, నాయకులకు సూచించారు. దీంతో చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి రిజర్వాయర్ ఛైర్మెన్ చల్లా నాగార్జునరెడ్డి తదితరులు హుటాహుటిన రంగంలోకి దిగి ప్రొక్లెయిన్‌లతో కాలువను పరిశుభ్రం చేసి వరదనీటి పారుదలకు ఆటంకం లేకుండా చేశారు. తమ సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే సోమిరెడ్డికి, సహకరించిన నాయకులకు రైతులు ధన్యవాదాలు తెలిపారు.

# 'కిమ్స్'లో అవయవ దానం

నెల్లూరులోని కిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల అవయవదానం జరిగింది. ఇందుకూరుపేటకి చెందిన మాచవరం మల్లికార్జున అనే వ్యక్తి బ్రైన్ స్ట్రోక్‌కి గురై బ్రైన్ డెడ్ కాగా, ఆయన భార్య..కుటుంబసభ్యుల అంగీకారంతో అవయవదానం చేసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అవయవ దానం విషయాన్ని జీవన్‌దాన్ సంస్థకు తెలియజేయగా నిబంధనల ప్రకారం అవయవాల కేటాయింపుకు ప్రభుత్వ ఆదేశాలు జారీచేశారని తెలిపారు. జీవన్‌దాన్ సంస్థ వారు ఆ అవయవాలను కర్నూలులోని ఆసుపత్రికి, ఒక కిడ్నీని నెల్లూరులోని ఆసుపత్రికి కేటాయించారని వారు పేర్కొన్నారు. మరణించిన తర్వాత కూడా అవయవదానంతో పలువురి జీవితాల్లో వెలుగులు నిలిపిన మల్లికార్జున మృత దేహానికి కిమ్స్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది గౌరవ వందనం చేసి, వీడ్కోలు తెలిపినట్లు వారు తెలియజేశారు. మల్లికార్జున అవయవదానం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని అందరూ కొనియాడారు.

# శంకరన్ సేవలు అపారం

నెల్లూరుజిల్లా పూర్వ కలెక్టర్, సీనియర్ ఐఏఎస్ అధికారి శంకరన్ జిల్లాకి చేసిన సేవలు అపారమని ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి కొనియాడారు. శంకరన్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 22న నెల్లూరు కలెక్టరేట్‌లోని ఆవరణలో ఉన్న రెవిన్యూ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, శంకరన్ చిత్రానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకరన్ ఐఏఎస్ అధికారిగా ఎంతో నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని, పేద బడుగు బలహీన వర్గాల వారికి ఆయన చేసిన సేవలు అమూల్యమని అన్నారు. అప్పట్లో నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా, ఆ తర్వాత త్రిపుర రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీగా వివిధ హోదాల్లో ఆయన అంకితభావంతో పని చేశారన్నారు. సంఘం నాయకులు నాగేశ్వరరావు, డానియెల్ పీటర్‌రావు, మురళి, సతీష్, అశోక్, బాలకోటమ్మ, గోపీకృష్ణ, ఆనంద్, వెంకటేష్ పాల్గొన్నారు.

# తల్లికి తనయ.. అంత్యక్రియలు



గుండెపోటుతో తల్లి మరణించడంతో, 9వ తరగతి చదువుతున్న ఆమె చిన్నకుమార్తె.. ధైర్యంగా తల్లికి అంత్యక్రియలు నిర్వహించింది. మండల కేంద్రమైన సంగంలో ఈనెల 22న జరిగిందీ ఘటన. తండ్రి కరోనాతో మరణించగా, పెద్దకుమార్తెకి వివాహమైపోగా, చిన్నపిల్ల అయిన భార్గవి, తన తల్లి పెరుమాళ్ళ ఆదిలక్ష్మితో పాటు కలసి ఉండేది. ఇప్పుడు హటాత్తుగా తల్లి మృతి చెందడంతో ఏకాకి అయిపోయింది. చివరికి బంధువుల సహకారంతో భార్గవి తన తల్లికి అంతిమ సంస్కారం చేయడం స్థానికంగా సంచలనంగా మారింది.

# చికెన్ వ్యర్థాల వాహన పట్టివేత

బుచ్చి రూరల్ మండలంలోని దామరమడుగు వద్ద ఈ నెల 22న ఓ చికెన్ వ్యర్థాల వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. 14 డ్రమ్ముల్లో ఉన్న ఆ వ్యర్థాలను గమనించి కేసు నమోదు చేశారు.

# పేదలను వేధిస్తే.. సహించను

○ లంచాల అధికారులకు క్లాస్‌పీకిన ఎమ్మెల్యే కోటంరెడ్డి



పేద మధ్యతరగతి ప్రజలను లంచాల కోసం వేధిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అవినీతి అధికారులను హెచ్చరించారు. ఆమేరకు అలాంటి అధికారులను ప్రస్తావిస్తూ, వారికి క్లాస్ పీకారు, కొందరు అధికారుల తీరుపైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు రావడంతో ఆయన విద్యుత్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో ఈనెల 23 గురువారం నాడు తమ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన అనేక అంశాల గురించి సంబంధిత శాఖల అధికారులు సిబ్బందిని ప్రశ్నించారు. మధ్యతరగతి ప్రజలను లంచాల కోసం ఎందుకు వేధిస్తున్నారని నిలదీశారు. మీ వైఖరి మారకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షా సమావేశంలో ఆధారాలతో సహా ఆయన బయట పెట్టడంతో కొంతమంది అధికారులు, సిబ్బంది గుటకలు మింగాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరికొందరు ఈ తప్పు మరోసారి చేయమని దీనిని సరిదిద్దుకుంటామని ఎమ్మెల్యేకి సర్దిచెప్పుకున్నారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని, రోజువారి కష్టం చేసేవారిని కూడా లంచాల కోసం వేధించడం సరికాదన్నారు. తొలి హెచ్చరికగా జాగ్రత్తగా పని చేసుకోవాలని వారికి చెప్పారు.

# వరద ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీ పర్యటనలు

• కొత్తవారైతేనేం.. కార్యరంగంలో భేష్ అనిపిస్తున్నారు





ఇటీవలే జిల్లాకి కలెక్టర్, ఎస్పీలుగా వచ్చినా, జిల్లాకి తాము కొత్తవారే అయినా, కార్యరంగంలో తమ ప్రతిభను చాటుకుంటున్నారు. అందులోనూ ఈ భారీ వానల్లో ప్రజలు ఎక్కడెక్కడ ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో, ఏఏ గ్రామాల్లో ఎలాంటి సమస్యలతో సతమతమవుతున్నారో అనుక్షణం తెలుసుకుంటూ, బాధితులకు తమ వంతు చేయూతనందిస్తున్నారు. కార్యాలయాల్లో కూర్చుని ఆదేశాలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా స్వయంగా ఆయా ప్రాంతాలను నేరుగా చూసి, అధికారులను ఎక్కడికక్కడ అప్రమత్తం చేస్తున్నారు. గత రెండు మూడురోజులుగా వర్షభీభత్సం, మరోవైపు తుఫాన్ భయం జిల్లాను వణికిస్తుండడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా ఎస్పీ అజిత వరద ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. ఎక్కడ ఇబ్బందులున్నట్లు సమాచారం అందితే అక్కడికి హుటాహుటిన వెళ్ళి తగు సాయం అందిస్తూ బాధితులకు భరోసాగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలతో, నిరుపేదలు..గిరిజనులతో అప్యాయంగా మాట్లాడుతుండడం అక్కడి ప్రజలనే కాదు..అధికారులను కూడా ఆకట్టుకుంటోంది. ఈనెల 22 బుధవారం నాడు మనుబోలు మండలం బద్దెవోలు పంచాయతీలోని పల్లెపాళెం గిరిజన కాలనీని సందర్శించారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులను ఆత్మీయంగా పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరదనీళ్ళు సముద్రంలోకి సాఫీగా వెళ్లిపోయేందుకు కొలనుకుదురులోని కొండవాగు ముఖ్యద్వారాన్ని విస్తరించడం ఎంతో అవసరమని అక్కడి ప్రజలు కలెక్టర్‌కి చెప్పారు. అదేవిధంగా, తమ కాలనీలోని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, తమకు భారీవానలు వరదల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత ప్రాతిపదికన పక్కా ఇళ్ళు నిర్మించాలని వారు కలెక్టర్‌ని అభ్యర్ధించారు. వారి సమస్యలని పరిశీలించి తప్పకుండా పరిష్కారానికి కృషిచేస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీఓ అనూష, డీఎస్పీ శ్రీనివాసరావు, తహశీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ జలజాక్షి, పొన్నూరు రామకృష్ణయ్య, శానంపూడి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నావూరు వాగును పరిశీలించిన జిల్లా ఎస్పీ:

భారీవర్షాలతో పొదలకూరు మండలం నావూరు వద్దనున్న పెద్ద వాగు పొంగి ప్రవహిస్తుండడం, చుట్టుపక్కలున్న నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలచిపోవడంతో బుధవారం జిల్లా ఎస్పీ అజిత వెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. వాగు ఉధృతిని చూసి, వానలు తగ్గి ప్రవాహం శాంతించే వరకు ప్రజలు వాగును దాటే సాహసం చేయొద్దని హెచ్చరించారు. ఆమేరకు ప్రజలు వాగువద్దకు రాకుండా పోలీసులతో పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. పెన్నానదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శివరామకృష్ణారెడ్డి తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.

## ఏఐసీసీ కో-ఆర్డినేటర్‌గా

# దామోదర్‌రావు

ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ కో-ఆర్డినేటర్‌గా నెల్లూరుజిల్లా అనంతసాగరం మండలం రాజునగర్‌కి చెందిన తానికొండ దామోదర్‌రావు నియమితులయ్యారు. ఆమేరకు ఏఐసీసీ ఎస్సీ విభాగం జాతీయ ఛైర్మెన్ రాజేంద్రపాల్ గౌతమ్ తాజాగా ఆయనకు నియామకపత్రాలను అందజేశారు.

# జలపాతాల వద్దకు వెళ్ళొద్దు

➢ పోలీసుల హెచ్చరిక

జిల్లాలోని రాపూరు మండలం పెంచలకోనలో ఉన్న జలపాతాల వద్దకు వెళ్ళడానికి ఎవరికీ అనుమతులు లేవని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా, పెంచలకోన జలపాతాల వద్దకి ఎవరికీ అనుమతివ్వడం లేదని ఈనెల 22న రాపూరు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

# పేకాటకు అడ్డాగా.. నెల్లూరు

○ పోలీసుల దాడులు..18మంది అరెస్ట్

నెల్లూరు నగరం పేకాటకు అడ్డాగా మారిపోయింది. ఎన్నిసార్లు పేకాటరాయుళ్ళను పట్టుకుంటున్నా, పేకాట కేంద్రాలపై దాడులు జరుగుతున్నా జూదరులు పట్టించుకోవడం లేదు. తగ్గేదే లే అంటూ.. జూదంతో తమ కుటుంబాలను కలతలమయం చేసుకుంటూనే ఉన్నారు. తాజాగా, నెల్లూరు నడిబొడ్డున ఉన్న ఓ హోటల్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తుండడాన్ని పోలీసులు గమనించి, ఆ పేకాట కేంద్రంపై ఈనెల 22న దాడులు చేశారు. పేకాటాడుతున్న 18 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి లక్షా 96వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ సీతారామయ్య, పోలీసు సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చిన్నబసారు ఇన్స్‌పెక్టర్ కోటేశ్వరరావు ఆ ధ్వర్యంలో నిందితులను అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వెట్టిచాకిరిని నిర్మూలించాలి



సమిష్టి కృషితో వెట్టిచాకిరి వ్యవస్థను నిర్మూలించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. ఇటీవల ఆయన కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన కోసం ఏర్పడిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇటుక బట్టీలు, పరిశ్రమలు, వ్యాపార దుకాణాలు, రొయ్యలు, చేపల గుంటలు, రైసుమిల్లులు, హోటళ్లు తదితర చోట్ల కమిటీ సభ్యులు ఆకస్మిక తనిఖీలు చేసి వెట్టిచాకిరి బాధితులను గుర్తించాలన్నారు. కనీస వేతనం చెల్లించకపోవడమే కాకుండా, వారి శ్రమను దోచు కోవడం, ఆర్థికస్వేచ్ఛను హరించడం, బందీలుగా పనిచేయించడం వెట్టిచాకిరి కిందకు వస్తాయన్నారు. వెట్టిచాకిరి వ్యవస్థలోని కార్మికు లను గుర్తించడంలో అధికారులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి వెట్టిచాకిరి నుంచి బాలలను, కార్మికులను విముక్తి చేసే కార్యక్రమానికి మానవతా దృక్పథంతో తమవంతు కృషి చేయాలని కోరారు. గత సమా వేశంలో వెట్టిచాకిరి నిర్మూలన కోసం తీసుకున్న చర్యలను కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సిహెచ్ విజయకుమార్‌రెడ్డి ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ సుజాత, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఎల్డీఎం మణిశేఖర్, జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు, ఐటీడీఏ పీఓ మల్లికార్జున్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో పావని, ఎస్ఐ వై.శ్రీహరి, కమిటీ సభ్యులు బషీర్, సుదర్శన్, పోలయ్య, సత్యవతమ్మ, పాపయ్య పాల్గొన్నారు.

# ఐఏబీ సమావేశం నిర్వహించాలి

**● రైతు నాయకుల వినతి**

సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం త్వరలో నిర్వహించాలని, పొలాలకు సాగునీరు ఎప్పుడు విడుదల చేయనున్నారో ఆ తేదీలను ప్రకటించాలని రైతు సంఘాల నాయకులు కోరారు. ఇటీవల వారు నెల్లూరులోని జిల్లా నీటి పారుదలశాఖ కార్యాలయం సూపరింటెండింగ్ ఇంజనీర్ దేశి నాయక్‌ను కలిసి ఆ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర రైతు సంఘం నాయకుడు రాజగోపాల్, జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముత్యాల గురునాథం, రైతు నాయకులు టి.గోపాల్, జి.రమేష్ పాల్గొన్నారు.

# 'కర్మయోగి'కి.. ఎంపీడీఓ సన్మానం



అనంతసాగరం మండలం చిలకలమర్రి గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో లెక్కల మాస్టారుగా పనిచేస్తున్న చల్లా చంద్రశేఖర్‌రెడ్డికి అధికారుల ప్రశంసలు లభిస్తున్నాయి. కేంద్రప్రభుత్వ 'మిషన్ కర్మయోగి' కార్యక్రమంలో భాగంగా, ఉద్యోగులకు నిర్వహిస్తున్న 'ఐ గాట్ కర్మయోగి' ఆన్‌లైన్ కోర్సుల్లో చంద్రశేఖర్‌రెడ్డి జాతీయ స్థాయిలో ప్రథమస్థానం సాధించిన విషయం తెలిసిందే. ఇటీవల నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీఏ మాజీ ఛైర్మెన్..రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక సలహాదారు డా.జి.సతీష్‌రెడ్డి ఆయన్ను మెచ్చుకుని సన్మానించారు. ప్రస్తుతం ఆయన 'మిషన్ కర్మయోగి'లో 5194పాయింట్లతో 1593 కోర్సులు పూర్తిచేసి, లీడర్‌బోర్డుపై ఫస్ట్ ర్యాంకులో ఉన్నారు కూడా. తాజాగా, అనంతసాగరం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఐజాక్ ప్రవీణ్ ఆ ఉపాధ్యాయుని సన్మానించారు. ఎంతో క్లిష్టతరమైన ఆ కోర్సులను పూర్తిచేస్తూ, జాతీయస్థాయిలో మండలానికి మంచి గుర్తింపును తెస్తున్నారంటూ ఆయన్ను అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు.ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది మస్తాన్, కళాధర్‌శర్మ, సీఆర్ఎంటీ మాధవ్ పాల్గొన్నారు.



# గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలి

## సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి పిలుపు

సమాజంలో అత్యంత పేదరికంలో ఉన్నది గిరిజనులేనని, వారి జీవితాల్లో వెలుగులు ప్రసరింపజేసేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేయాలని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. దీపావళి సందర్భంగా ఆయన ముత్తుకూరు మండలం పిడతాపోలూరు పంచాయతీలోని జంగాలకండ్రిగ, బ్రహ్మదేవం పంచాయతీ లోని గిరిజన కాలనీల్లో తన మనుమడు, మనుమరాలితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన చిన్నారులకి టపాసులు అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సోమిరెడ్డి మనుమడు రణదేవ్, మనుమరాలు అమైరా వారికి స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జంగాలకండ్రిగ కాలువగట్టున గిరిజనులు అత్యంత దుర్భరపరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారని, వారికి ఇటీవలే విద్యుత్ సౌకర్యం కల్పించామని చెప్పారు. గిరిజనుల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు పరిశ్రమల యాజమాన్యాల సహకారం తీసుకుంటున్నామని, సర్వేపల్లి నియోజకవర్గంలోని పలు గిరిజన కాలనీలను దత్తత తీసుకునేందుకు పామాయిల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు ముందుకొచ్చాయని తెలిపారు. బ్రహ్మదేవం గిరిజన కాలనీకి రూ.96 లక్షల వరకు జెమినీ కంపెనీ ఖర్చు పెట్టబోతున్నట్లు చెప్పారు. మిగిలిన కంపెనీలు కూడా తాము దత్తత తీసుకున్న గిరిజన కాలనీల్లో అవసరమైన వసతులు కల్పించబోతున్నాయని తెలిపారు.

# ఎన్‌బీకెఆర్‌లో ప్రాంగణ ఎంపికలు




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల బెంగుళూరుకు చెందిన ప్రముఖ కంపెనీ ఎం.కొరెటా వారు బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఆ కంపెనీ ప్రతినిధి కౌశిక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. మొత్తం 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆన్‌లైన్ పరీక్షల్లో 17 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారని, వీరికి టెక్నికల్ ఇంటర్వ్యూలు ఆన్‌లైన్‌లో నిర్వహించగా, వారిలో 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి 3 లక్షల రూపాయల వేతనం ఉంటుందని అంటూ, ఆ విద్యార్థు లందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ముందర పొట్టెమ్మతల్లి సేవలో.. కావలి ఎమ్మెల్యే



కావలి రూరల్ మండలం అన్నగారిపాళెంలో వెలసి వున్న శక్తిస్వరూపిణి శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి దేవతా సమేత శ్రీ గంగమ్మ తల్లి తిరునాళ్ళ మూడురోజుల పాటు అంగరంగవైభవంగా జరిగింది. చివరి రోజు(మూడవరోజు) ఈనెల 19న కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కావలి నియోజకవర్గ ప్రజలు సుఖసంతో షాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేని స్వాగతించి, అమ్మవారి వద్ద పూజలు చేయించారు.

# ఆదిశంకర ధ్యానమందిరంలో.. కార్తీక పూజలు

కార్తీకమాసం సందర్భంగా నెల్లూరులోని ఆదిశంకర ధ్యానమందిరంలో ఈనెల 22 నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకు కార్తీక పూజలు వైభవంగా జరుగనున్నాయి. ప్రతిరోజూ ఏకవార రుద్రాభిషేకార్చనలు, నాలుగు సోమవారాల్లో పూర్ణిమ, మాస శివరాత్రి రోజుల్లో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్ర వారాభిషేకార్చనలు నిర్వహిస్తామని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# టూకీగా...



## శ్రీకొలను జడ్పీ ప్రాథమిక పాఠశాల తనిఖీ

ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలనులోని జడ్పీ ప్రాథమిక పాఠశాలను జిల్లా డైట్ సీనియర్ అధ్యాపకులు నటరాజన్‌మూర్తి ఇటీవల ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజనం నాణ్య తను పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులతో చర్చించారు. ఎంఇఓ జ్యోతి, ఎంఇఓ -2 సాయిప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## జంపాలవారిపాలెంలో బాలికా దినోత్సవం

లింగసముద్రం మండలంలోని జంపాలవారిపాళెంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో ఇటీవల అంతర్జాతీయ బాలికా దినోత్సవం జరిగింది. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధాదేవి విద్య ఎంత ముఖ్యమో వివరించారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయిని పొందాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, కృష్ణకుమారి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## అల్లీపురంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

నెల్లూరు రూరల్ మండలం అల్లీపురంలో ఎస్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. బాలికలకు ఆటలపోటీలు పెట్టి విజేతలకు బహుమతులిచ్చారు. బాలల హక్కులు-చట్టాలను వివరించారు. సీడీపీఓ అరుణ, సూపర్‌వైజర్ శకుంతల, హెడ్మాస్టర్ రవీంద్ర నాథ్ పాల్గొన్నారు.

## కురుచెర్లపాడులో పశువైద్య శిబిరం

వెంకటాచలం మండలం కురుచెర్లపాడు గ్రామంలో మండవ ఫౌండేషన్-పశుసంవర్ధకశాఖ వారు సంయుక్తంగా ఇటీవల పశువైద్య శిబిరం నిర్వహించారు. గేదెలను పరీక్షించి, తగు చికిత్సలు చేశారు. కనుపూరు పశువులాసుపత్రి వైద్యాధికారి మంజునాథ్, మండవ ఫౌండేషన్ వైద్యాధికారి శ్రీనివాసులు నాయుడు, గోపాలమిత్రలు శ్రావణ్, దిలీప్ పాల్గొన్నారు.

## పెంచలకోనలో నిత్యాన్నదానానికి.. లక్ష విరాళం

పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామిదేవా లయానికి వచ్చే భక్తుల నిత్యాన్నదానానికి కడపజిల్లా పొద్దుటూరుకి చెందిన ఏ.జ్ఞానశ్రీ పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లితండ్రులు నరసింహులు-ప్రియాంకలు ఇటీవల లక్ష రూపాయల విరాళం అందించారు. ఆ చెక్కును ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసరెడ్డికి అందజేశారు.

## పార్లపల్లి శివాలయంలో ఉచిత వైద్యశిబిరం

విడవలూరు మండలం పార్లపల్లిలోని ఆధ్యాత్మిక సేవా సంస్థ వారు స్థానిక శివాలయంలో ఇటీవల వైద్యశిబిరం నిర్వహించి రోగులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందు లిచ్చారు. విడవలూరు డిగ్రీ కళాశాల అధ్యాపకులు చక్రపాణి ఆధ్వర్యంలో, కళాశాల రెడ్‌రిబ్బన్ క్లబ్ సహకారంతో చేపట్టిన ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత, వైస్ ప్రిన్సిపాల్ మధు పాల్గొన్నారు.

## రాజువారి చింతలపాలెంలో విద్యుత్‌షాక్‌తో విద్యార్థి మృతి

తల్లి చనిపోయి ఉత్తరక్రియలు జరిగిన మరుసటిరోజే తనయుడు ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో మరణించాడు. కావలి రూరల్ మండలం రాజువారి చింతలపాళెంలో ఇటీవల ఈ దుర్ఘటన జరిగింది. ఆ గ్రామానికి చెందిన బి.మాల్యాద్రి కుమారుడు సాయి కావలిలో ఓ కళాశాలలో ఇంటర్ చదువు తున్నాడు. దీంతో కళాశాల విద్యార్థులు ఆవేదన చెందారు.

## కావలిలో గిరిజన బాలురకు ఉచిత రక్తపరీక్షలు

కావలిలోని వెంగళరావునగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలోని 140 మంది బాలురకు కావలి ఆర్డీఓ వంశీకృష్ణ ఆదేశాలతో ఇటీవల కావలి రెడ్‌క్రాస్ వారు ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. రక్తంలో హిమో గ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న ముగ్గురు బాలురను గుర్తించి వారికి చికిత్సలకు ఏర్పాటుచేశారు.

## విడవలూరులో అంకమ్మ అమ్మవారికి ప్రత్యేకపూజలు

విడవలూరు గ్రామదేవత అంకమ్మ అమ్మవారికి ఈనెల 19 ఆదివారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు గిరిస్వామి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.



## సంపూర్ణ ఆరోగ్య వికాసమే లక్ష్యంగా... నెల్లూరులో తొలిసారిగా

# సుషుమ్న క్రియా యోగ ధ్యాన కార్యక్రమం

## పూజ్యశ్రీ ఆత్మానందమయి అమ్మవారిచే యోగా ధ్యాన భోదన

నవంబర్ 4వతేదీ మంగళవారం నాడు నెల్లూరు నగరంలోని, గొలగమూడి రోడ్డులో వున్న వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ ఒక అద్భుతమైన కార్యక్రమానికి వేదిక కాబోతోంది. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి గాంచిన 'దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగా ఫౌండేషన్' వారి 'సుషుమ్న క్రియా యోగ ధ్యాన కార్యక్రమం' మన నెల్లూరులో జరగబోతోంది. సాయంత్రం 5గంటల నుండి రాత్రి 9గంటల వరకూ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య కార్యక్రమాలతో వీపీఆర్ ప్రాంగణం సందడిగా మారనుంది. ప్రపంచ నలుమూలల నుండీ వచ్చే వందలాది మంది సాధకులు ఈ మహోన్నత కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

ఈ అంతర్జాతీయ సంస్థ నిర్వహణలో కార్తీక పౌర్ణమి ప్రత్యేక కార్యక్రమంగా జరిగే ఈ యోగా పండుగలో ప్రపంచ ప్రఖ్యాత గురువులు పూజ్యశ్రీ ఆత్మానందమయి అమ్మవారిచే ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు. శారీరక, మానసిక, సామాజిక, ఆధ్యాత్మిక, భావపూర్ణ శ్రేయస్సును అందించే ఈ సుషుమ్న క్రియా ధ్యానం అత్యంత శక్తివంతమైన ప్రక్రియ అని నిర్వాహకులు చెప్తున్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించి, ప్రశాంతతను అందిస్తుందని, ఇది ఎవరైనా చాలా సులభంగా సాధన చేయగల అరుదైన అద్భుత ప్రక్రియ అని అనుభవజ్ఞులు ధృవీకరిస్తున్నారు.

### సేవే పరమావధిగా సమసమాజ స్థాపనే విధిగా..

సుషుమ్న క్రియా యోగ ధ్యానం ద్వారా ప్రపంచ మానవాళి సంపూర్ణ ఆరోగ్య వికాసం సాధించడంలో సహాయపడటమే ప్రధాన లక్ష్యంగా రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించబడిన అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థే 'దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగా ఫౌండేషన్'. ఈ లక్ష్యం దిశగా మహాగురువులు అందించిన పద్ధతిలో సుషుమ్న క్రియా యోగాన్ని అందరికీ ఉచితంగా అందించడంతో పాటు, విస్తృతమైన సేవా కార్యక్రమాలను కూడా ఈ సంస్థ నిర్వహిస్తోంది.

గర్భిణీ స్త్రీల ఆరోగ్యం కోసం సుషుమ్న 'గర్భ సంస్కార్', చిన్నారులకు భారతీయ విలువల పట్ల ఆసక్తి కలిగించే 'సుషుమ్న శిక్షణ' వంటి కార్యక్రమాలని ఈ సంస్థ రూపొందించి నిర్వహిస్తోంది. అలాగే, దేశ వ్యాప్తంగా ఉన్న స్కూలు విద్యార్థులకు, యువతకు ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించే ధ్యాన శిబిరాలు, శిక్షణా కార్యక్రమాల వంటివి కూడా పూజ్య గురు మాత ఆత్మానందమయి అమ్మవారి మార్గదర్శకత్వంలో 'దివ్య బాబాజీ సుషుమ్న క్రియా యోగ ఫౌండేషన్' జరుపుతోంది.

ప్రజలు జీవితంలోని ప్రతి అడుగులో ఏకాగ్రతతో, శ్రద్ధతో తమ లక్ష్యాలని సాధించడంలో సహాయపడే ఉద్దేశ్యంతో అంతర్జాతీయ సదస్సులని, సమావేశాలని, మీట్‌లని, సమ్మేళనాలని నిరంతరాయంగా నిర్వహిస్తోంది ఈ సంస్థ. వీటితో పాటు దేవాలయాలు, పాఠశాలలు మరియు కళాశాలలు వంటి వివిధ వేదికలపై కూడా ఉచిత ధ్యాన శిక్షణా కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నారు. ఈ ధ్యానం సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడం కోసం ఉపకరిస్తుంది. మనస్సు, శరీరం, ఆత్మల సామరస్యాన్ని సాధించడానికి కూడా ఇది అత్యంత శాస్త్రీయమైన పద్ధతి. అమ్మవారి శిష్యులే సేవకులుగా మారి, సమాజంలో మంచిని నెలకొల్పడం కోసం కృషి చేస్తూ.. శ్రమిస్తున్నారు. విశ్వంలోని ప్రాణి కోటి సంక్షేమమే తమ అమ్మవారి ధ్యేయం అంటూ తపిస్తున్నారు. నేటి యువతరానికి భారతీయ సనాతన ధర్మంలోని సత్యాలు అర్థమయ్యే రీతిలో, చాలా సరళంగా ఆమె వివరిస్తారు. అమ్మవారివి క్లిష్టతరమైన అంశాలు కాదు. సంక్షిప్తమైన కఠిన నిజాలు. అందుకే అమ్మ సందేశాలు లక్షలాది మందిని ఆకట్టుకుని వారి మనసులని కదిలి స్తున్నాయి.

శ్రీశ్రీశ్రీ ఆత్మానందమయి అమ్మవారి ధ్యాన సదస్సును తొలిసారిగా ఈ సంస్థ మన నెల్లూరులో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే. ప్రవేశం పూర్తిగా ఉచితం.

### సుషుమ్న క్రియా యోగ అత్యంత సరళం సులభతరం!

సుషుమ్న క్రియా యోగాని అత్యంత సులభంగా ఎవరైనా సాధన చేయొచ్చు. ఇందులో కఠోర నియమాలు ఏమీ వుండవు. ప్రతిరోజు కేవలం 21 నిమిషాల నుండి 49 నిమిషాల పాటు సాధన చేయడం వల్ల అసంఖ్యాకమైన ప్రయోజనాలు కలుగుతాయి. "సుషుమ్న క్రియా యోగ క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా నివారించగల అద్భుత ప్రక్రియ" అని ప్రపంచ ప్రఖ్యాత ఆంకాలజీ నిపుణులు నోరి దత్తాత్రేయుడు కితాబు ఇచ్చారంటే ఈ యోగా గొప్పదనాన్ని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. అనేక రంగాల్లో ప్రతిభావంతులైన వారు, ఈ సాధన చేస్తూ ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఎంతో ఆరోగ్యంగా, శక్తివంతంగా ఉండగలుగుతున్నాం అని గర్వంగా చెప్తున్నారు. అంతేకాకుండా ఈ యోగ గురించి అందరికి వివరిస్తున్నారు. ఎంతో మంది వైద్యులు సైతం పూజ్యశ్రీ ఆత్మానందమయి అమ్మవారి శిష్య కోటిలో చేరి, ఈ సాధనని ప్రచారం చేయడంలో భాగస్వాములవుతున్నారు.

ఇంతటి అపురూపమైన, అరుదైన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం నెల్లూరీయులకి లభించింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అశేషంగా తరలి రావాలని కార్యక్రమ నిర్వాహకులు కోరుతున్నారు. శాంతాబయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా పాల్గొనబోతున్నారు.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com